# విషయసూచిక


| | | |
|---|---|---|
| నా కుటుంబము... | ఛీఫ్ ఎడిటర్ | 3 |
| బ్రాహ్మణ పూజారి..... | పరవస్తు | 4 |
| నిత్యజీవజలము | నిత్యజీవజలము మాసపత్రిక సౌజన్యంతో | 6 |
| శాశ్వత రక్షణ | రెవ.డా॥కె.జోసఫ్, ఒంగోలు | 8 |
| మహాయజ్ఞము | రెవ.డా॥బి.శాంసన్, చెన్నై | |
| | రెవ.డా॥పి.జె.పంచరత్నం, నంద్యాల | 10 |
| అత్యంత ప్రియమైన అమ్మ | శ్రీమతి బి.విమలారెడ్డి, హైదరాబాద్ | 12 |
| మదర్ తెరీసా | శ్రీయడవల్లి ప్రసాదరావు, హైదరాబాద్ | 14 |
| విశ్వాసంలో ఓ మెట్టు | కొడవటికంటి | 16 |
| సాక్ష్యము | శ్రీమతి వింజమూరి వసంతకుమారి, బొబ్బిలి | 19 |
| **Paul and Silas...** | S. Kamalamma, Pulivendula | 21 |
| వారి బాటలో.... | రెవ. వి.వి.కె.శర్మ, బొబ్బిలి | 23 |
| అక్టోబర్ నెల ప్రశ్న | శ్రీ పంతగాని గ్రేషియస్, ఏలూరు | 25 |
| డాక్టర్ మేరియన్ బేర్ | శ్రీ కె.జె.డబ్ల్యు. జయకుమార్, నెల్లూరు | 26 |
| సువార్తలలోని యేసు కథ | కొడవటికంటి | 27 |
| ఏదినిజం?ఏదిఅబద్ధం? | శ్రీ వి.శేఖర్‌రెడ్డి, నెల్లూరు | 29 |
| న్యూస్ | హన్నాకృప డెస్క్ | 31 |



**చిరునామా :**

**కొడవటికంటి సామ్యేల్ రాజేంద్ర**

చీఫ్ ఎడిటర్

**హన్నాకృప**

పోస్ట్‌బాక్స్ - 51, 54-1-23(ఎ)

కృపాదానంవీధి, క్లాపేట,

6వ లైను, ఒంగోలు- 1.



హన్నాకృప

ఆధ్యాత్మిక మాస పత్రిక


# HANNA KRUPA

## Christian Devotional Monthly Magazine


**సంపుటి : 7** **సంచిక : 5**


**ప్రభువగు యెహోవాయే నాకు బలము**


Founder :

**Kodavatikanti Emmanuel Rajendra,** B.A.,B.L.,

Editor :

**Nathaniel R. Kodavatikanti,** B.Th.,M.A.,(M.Phil)

Cell : 9908822365

Hon. Editor :

**A.N.R. Zakkam**

D.G.M., SOMA Enterprises, Rajasthan

Hon. Advisor :

**Yadavalli Prasada Rao**

D.A.O.,G.H.M.C., Hyderabad

Patrons :

**Dr. Y.S. Purushotham Reddy**

Superintendent, Rajareddy Hospital

Pulivendula

**Rev. Dr. K. Joseph**

Director, I.E.R.F. Ongole

**Rev. Dr. M.S. Santhavardhan**

Director, Good News Messengers, Guntur



**ఆన్‌లైన్ అకౌంట్ నెం. : 10957294362**

**బ్రాంచి నెం. : 0890 స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

**కె. సామ్యేల్ రాజేంద్ర, కృపాదానంవీధి, క్లాపేట, ఒంగోలు**

**సెల్ : 9866716506**

సంపాదకీయం

# నా కుటుంబము



శ్రీమతి పులుకూరి సుగుణమ్మగారు నా ఆత్మీయ అక్క. 1952లో నాకు 12 సంవత్సరాల వయస్సులో నేను ఒంగోలు వచ్చినప్పుడు అప్పుడు హెచ్.సి.యం.లో చదువుతూ మాకు సండేస్కూలు తీసుకునేవారు. తరువాత అదే స్కూల్లో టీచర్‌గా పనిచేసి రిటైరయ్యారు. ఆమె చక్కగా చిత్రలేఖనం చేసేవారు.

గత ఏడు సంవత్సరాలుగా తరచు సుగుణక్కని కలుసుకొని ఆత్మీయ మేలులు పొందాను. ఆమె లోతైన విశ్వాసి. వారి వ్యక్తిగత సాక్ష్యమును హన్నాకృపలో ప్రచురించాము. హన్నాకృపలో ప్రసంగాలు వెయ్యము కనుక వారు వ్రాసి ఇచ్చిన ప్రసంగాలు నా ఫైల్లో వుండిపోయినవి.

2008 ఆగష్టు నెలలో ఆమె ప్రభువు సన్నిధికి చేరింది. తరువాత నేను ఆమె వ్రాసిన ప్రసంగాలన్నీ చదివాను. పది నెలలుగా 'నా కుటుంబము' సంపాదకీయంగా ప్రచురిస్తున్నాము. శ్రీమతి సుగుణమ్మగారి రచన 'చిన్నచూపు' కుటుంబ వ్యవస్థపై వ్రాసింది కనుక సంపాదకీయం ధారావాహికలో పదకొండవదిగా ప్రచురిస్తున్నాము.

## చిన్నచూపు

సమాజములో, కుటుంబములో అధికులైన వారు, అల్పులైనవారిని చిన్నచూపు చూచుట సర్వసామాన్యమైన విషయం. డబ్బులేనివారిని డబ్బున్నవారు, బలహీనులను బలవంతులు తృణీకరించుట సర్వత్రా చూడగలము. యిక మన దేశములో కులాధిక్యత కూడ ఒకటైయున్నది.

ఇవన్నీగాక మరొక సున్నితమైన మిక్కిలి అవమానకరమైన విషయము కూడ వున్నది. అపొ.కార్య.6:1లో ఆ దినములలో శిష్యుల సంఖ్య విస్తరించుచున్నప్పుడు జరిగిన విషయం వ్రాయబడింది. అపొ.కార్య.5:12లో ప్రజల మధ్య అనేకమైన సూచక క్రియలును, మహాత్కార్యములును అపొస్తులులచేత చేయబడుచుండెను. వారందరు ఏక మనస్కులై సొలొమోను మంటపములో నుండిరి. కడమవారిలో ఎవడును వారితో కలిసికొనుటకు తెగింపలేదు గాని ప్రజలు వారిని ఘనపరచుచుండిరి. పురుషులు, స్త్రీలు, అనేకులు మరి ఎక్కువగా విశ్వాసులై ప్రభువు పక్షమున చేర్చబడిరి. అపొ.కార్య.2:44లో విశ్వసించిన వారందరు ఏకముగ కూడిరి. తమకు కలిగినదంతయు సమిష్టిగ పంచుకొనిరి. తమ తమ చరస్థిరాస్థులను అమ్మి వారి వారి అక్కర కొలది అందరికి పంచిపెట్టిరి. వారేకమనస్కులై ప్రతిదినము దేవాలయములో తప్పక కూడుకొనుచు రొట్టె విరుచుట, దేవుని స్తుతించుట వలన ప్రజల వలన దయనొందినవారైరి. ఆనందము, నిష్కపటమునైన హృదయముతో, ఆహారము, అందరూ కలిసి పుచ్చుకొను చుండిరి. మరియు దీనిని చూచి సంతసించిన ప్రభువు రక్షణ పొందుచున్న వారిని అనుదినము వారితో చేర్చుచుండెను.

ఆహా! ఎంత అందమైన దృశ్యము. దీనిని మనము ఊహించుకొనినప్పుడు. నా మట్టుకు నాకు నేనును వారితో వుండి వుంటే ఎంత బాగుండును అనుకొనుచున్నాను. ఆ చక్కని దృశ్యము చెరిగినట్లున్నది. అనుదిన పరిచర్య, అన్నపానాదుల వడ్డన, సహవాసములో చిన్నచూపు ఏర్పడినది. తమలో కలిసివున్న విధవరాండ్రను చిన్నచూపు చూచిరని గ్రీకుభాష మాట్లాడు యూదులలో అసంతృప్తి, అలజడి, సణుగు పెద్దదైనది. పేతురు చెవినబడినది. చక్కని ఆదర్శవంతమైన ఐక్యకుటుంబము, విశ్వాసుల సహవాసము అయినా చిన్న అపశృతి. చిన్నచూపు వలన (పక్షపాత ధోరణి) విధవరాండ్రు అవమానము చెందారు, దుఃఖించారు, పరాభవించబడినారు.

**విధవరాండ్రు :** లోకం విధవరాండ్రను ఎప్పుడు చిన్నచూపే చూస్తుంది. ఇది నా స్వానుభవము కూడా. ఆ చిన్న చూపు హృదయాన్ని చీల్చివేసే చూపు. గుండె చెదరిపోయే చూపు. కారణము తెలియదు. హెబ్రీయులందరిలో కనిపించిన చిన్నచూపు గ్రీకు భాష మాట్లాడు యూదులు గుర్తించారు. నేటి సమాజములో కుటుంబములో వృద్ధులైన విధవరాండ్రను చూసే చిన్నచూపునుబట్టి వారి పక్షముగా నిలబడే వారెవరైనా ఉన్నారా? నేటి కుటుంబాలలో విధవరాండ్రు, వృద్ధులు, అంగహీనులు, మానసిక రోగులు ఎంతగా అవమానించబడుతున్నారు? ఎంతగా తృణీకరించ బడుచున్నారు? వారి మీద ప్రసరించే పెద్దవారి చిన్నచూపు వారినెంతగా బాధిస్తుందో వారికి తెలియదా? కాదు, కాదు వారి స్థానం నిర్ణయించబడియే

(...మిగతా 18వ పేజీలో)

# బ్రాహ్మణ పూజారి సత్యాన్వేషణ



**" విహ్వ్య గోప్త్రారాం మహక్యోదధిన కర్యుంతి హన్వా యాన పర్యతాసీన్ "**

"అక్కడ కొంతమంది స్త్రీలు, పురుషులు కలసి నలభై మందికి పైగా ఒక సహోదరి ఇంట్లో కూడుకొనేవారు. ఆ సహోదరియే నా ఇంటి అద్దె భారము మరియు నా కుటుంబ పోషణ భారము వహించేది. ఈ విధంగా జనవరి వరకు నేను ఒంటరిగా వారి దగ్గర వున్నాను. జనవరి పది మధ్యాహ్నం వారు నన్ను చాలా తొందరపెట్టగా నేను నా కుటుంబమును ఒరిస్సా రాష్ట్రము నుండి తీసుకు రావడానికి ప్రయాణమై వెళ్ళితిని. జనవరి 25న నా పరివారముతో కూడ కలసి మా సామాగ్రి అంతటిని తీసుకొని హైదరాబాద్ చేరాము. ఫిబ్రవరి 18 వరకు ఆ చిన్న సంఘముగా ఏర్పడిన కూడికను కాపరివలె నడిపిస్తూ వున్నాను. ఈలోగా మధ్యలో సభలకు రమ్మని కొంతమంది ఆహ్వానించగా ఆ చిన్న కూడికలో వున్నవారు నన్ను సభలకు వెళ్ళకూడదని అభ్యంతరపరచిరి. అంతేగాక మీకు ప్రత్యేకమైన పని కొరకు స్థిరపరచబడ్డారు. గనుక మీకివ్వబడిన పనిని మాత్రమే మీరు జాగ్రత్తగా కొనసాగించాలి. మీరలా తిరుగకూడదు అని కూడ అన్నారు. ఈ విషయం ఆలోచిస్తూ ప్రార్థనలో పెట్టాను. అంతేగాక, 'మీరు వాక్యం చెప్పేటప్పుడు మాకు పొడిచి చెప్పినట్లుంది. మీరు వాక్యం చెప్పే ధోరణి కూడ మార్చుకోవాలి. మీ భాష సరిగా లేదు. గనుక మీరు భాష కూడ నేర్చుకోవాలి' అని కూడ అన్నారు. నేను ఒకరోజు మధ్యాహ్నం ఉపవాస ప్రార్థనలో వాక్యపరిచర్య చేస్తుంటే మధ్యలో కుటుంబ భారము వహించిన సహోదరి 'మీ ప్రసంగాలు మాకు అక్కర్లేదు ఆపండి. నా యింటి నుండి వెళ్ళిపోండి' అని అన్నారు. నేను వెంటనే ఆపేసి నా యింటికి వెళ్ళిపోయాను.

విశ్వాస పరీక్ష :

"ప్రభువా! నీవు హైదరాబాద్‌కు సిద్ధపడమన్నావు. నేను సిద్ధపడ్డాను. నీవు ప్రయాణమవ్వమన్నావు. నేను ప్రయాణ మయ్యాను. అయినను ఎక్కడో పొరపాటు చేశాను. నాకది అర్థంకాకుండా వుంది. నా పొరపాటును ఎత్తి చూపించుము. నీకిష్టము లేని పని నేను చేసియున్నాను గనుక నాకీవిధంగా జరిగిందని నేను నమ్ముచున్నాను. దయచేసి నా తప్పు చూపించు" అని ప్రార్థించుచుండగా "నా కుమారుడా! నేను నిన్ను హైదరాబాద్ రమ్మన్నది వాస్తవమే కాని వచ్చాక యేమి చేయాలో నేను నీకు చెప్పకుండానే మనుష్యులు ఆలోచించి చెప్పింది నీవు చేశావు. నువ్వు ఇక్కడ వుండుట నా చిత్తము కాదు గనుకనే నిన్ను బయటకు తెచ్చాను" అని మనిషితో మనిషి మాట్లాడుచున్నట్లు దేవుడు నాతో చెప్పి బలపరిచాడు. అదే రోజు సాయంత్రం మూడున్నరకు హైదరాబాద్‌లోని లింగంపల్లి మరియు సెంట్రల్ యూనివర్సిటీ ప్రాంతములో సభలు పెట్టించిన ఒక సహోదరుడు నన్ను ఆహ్వానించగా నేను వెళ్ళి ఆ ప్రాంతంలో ఐదు రోజులుండి పగలంతా ఉపవాసముండి మోకాళ్ళూని ప్రార్థించేవాడను. రాత్రి సభానంతరము 11 గంటలకు భోజనంచేసి ఉదయం రెండు గంటలకు ప్రార్థన చేస్తుండేవాడను.

నేను ఈ సభలకు ఒక సహోదరుని స్కూటర్ మీద ప్రయాణమై వెళ్తుండగా రెబక్కా "ఏమండీ! మీరు వెళ్తున్నారు, రేపు ఇంటి అద్దె కట్టాలి. ఇంట్లో ఈ ఒక్కపూటకే బియ్యం వున్నాయి. ఏదైనా కొనడానికి ఇంట్లో నయాపైసా లేదు. మన సమస్త భారము వహించిన సహోదరి నేటికి రెండు రోజుల క్రితం మనకు ఇవ్వాల్సినది ఇవ్వలేదు. ఇవాళ ఆమె మనలను వెళ్ళగొట్టారు. మీరు చూస్తే సభలకు వెళ్తున్నారు. పిల్లలు చూస్తే చాలా చిన్నవాళ్ళు. ఆకలికి తట్టుకోలేని వయస్సు. నాకిక్కడ బంధువులుగాని, తెలిసినవాళ్ళుకాని లేరు. తెల్లవారితే పిల్లలు ఆకలి అని ఏడుస్తారు. నేను ఏం చెయ్యాలో చెప్పి వెళ్ళండి" అని రహస్యంగా వంటగదిలోకి పిలిచి ఏడుస్తూ చెప్పింది. నేను కూడా ఏడ్చాను. వెంటనే ఒక మాట చెప్పాను. "అమ్మాయ్, నీవు దిగులు చెందకు. నేను మధ్యాహ్నం అక్కడ నుండి తరిమివేయబడి మనింటికి వచ్చి ప్రార్థించుచుండగా నీవు పిల్లలకు భోజనము పెట్టుచుంటివి. అప్పుడు నేనొక స్వరము విన్నాను" అని నేను విన్నది ఆమెతో చెప్పాను. అంతలో బయట నా కొరకు స్కూటర్‌తో వేచియున్న సహోదరుడు స్కూటర్ హారన్ కొట్టుచుండగా మా ఇంటి తలుపు ఎవరో తడుతూ "పాస్టర్ పరవస్తుగారిల్లు ఇదేనా?" అన్న స్త్రీ స్వరము విన్నాము. "అవును" అని సమాధానమిస్తూ, "ఏం కావాలమ్మా" అని అడిగాను. "అబ్బే, ఏమీ లేదండీ మీ గురించి

చాలాసార్లు విన్నాను. మిమ్మల్ని చూడాలని, ప్రార్థన చేయించుకోవాలని వచ్చాను'' అంది. ''సరే, రండి మోకరించండి" అని అంటుండగా "త్వరగా రండి" అన్నట్లు స్కూటర్ హారన్ వినబడుతుంది. "ఆ.. వస్తున్నా బ్రదర్, ప్లీజ్ వన్ మినిట్, చిన్న ప్రార్థన చేసి వస్తాను" అని ప్రార్థించాను. "పాస్టరుగారు, ఎక్కడికైనా ప్రయాణమా?" అని అడిగింది ఆమె. "అవునమ్మా ఈ రాత్రి మీటింగులో మాట్లాడాలి. అందుకే తొందరలో వున్నాను. సుమారు నాలుగొందల కిలోమీటర్ల ప్రయాణం చెయ్యాలి. మళ్ళీ మరోసారి రండమ్మా, తీరిగ్గా మాట్లాడుకుందాం" అని అంటూ నా బ్రీఫ్‌కేస్ తీసుకొని ప్రయాణమవుతుండగా ఆమె పర్సులోనుండి యాభై రూపాయలు తీసి నాకు కానుకగా ఇచ్చారు. ఆమెను దీవించి అది నా భార్యచేతిలో పెట్టాను. మేము ఒకరి ముఖాలు ఒకరు చూసుకొని మా మూగభాషలో దేవునికర్థమయ్యేటట్లు కృతజ్ఞతా స్తుతులు చెల్లించాము.

నా ప్రియ పాఠక మహాశయులారా! మీ క్లిష్టపరిస్థితులు మీకు చుట్టుముట్టి యున్నప్పుడు, మీకు లేమి కలిగినప్పుడు, దుఃఖము కలిగినప్పుడు యేసు యొద్దకు పరుగెత్తండి. ఉపవాసముండి, మోకరించి ప్రార్థించండి. యేసుప్రభువుతో మీకు జరుగుతున్న విషయమునంతటిని చెప్పండి. ఆయన నుండి జవాబు వచ్చేవరకు కనిపెట్టండి. ఎవరి దగ్గరకు పరుగెత్తవద్దు. ఏమీ ఆలోచించవద్దు. ఆయన ఆలోచనయే మీకు ప్రధానము. ఒకవేళ మీరు యేసుప్రభువు యొక్క భక్తులై యుండి లేక విశ్వాసులైయుండి తొందరపడి మీ ఆలోచన ప్రకారము ఏదైనా చేసిన యెడల అది మీకు ప్రతికూలముగ మారును. అప్పుడు మీరు ప్రభువు యొద్దకు వెంటనే వచ్చి ప్రభువు సన్నిధిలో మీ తప్పును ఒప్పుకోండి. మీ తప్పు మీకు తెలియకపోతే "ప్రభువా! ఎక్కడో మాలో తప్పున్నది. మాకు తెలియకుండానే ఏదో పొరపాటు నీ యెదుట జరిగినది. మేము మట్టిలో నుండి తీయబడిన మానవమాత్రులము అని మీరెరుగుదురు గదా" అని ప్రార్థించి దైవచిత్తము ఎరుగుటకు కనిపెట్టి ఆయన చిత్తానుసారముగ చేయుటయే మీ కర్తవ్యం. అది నా అనుభవం.

నేను స్కూటర్‌పై ప్రయాణమై లింగంపల్లి వెళ్ళాను. ఆ రాత్రి సభలో మాట్లాడి, నాకు కేటాయించిన గదికి వెళ్ళి ఆ రాత్రంతా మోకరించి ప్రార్థించాను. నేను ఇల్లు విడిచి పెట్టేటప్పటికి ఒక్క పూటకు బియ్యం వుండెను గనుక రెండవ దినమంతా ఉపవాసంతో గడిపాను. రెండవ దినము సభానంతరం నిద్రపోయాను. లేచిన తర్వాత నా హృదయమంతా భయంతో నిండిపోయింది. వెంటనే నేను "ప్రభువా! నా ఇంటికి బియ్యము, కావలసిన రేషనంతా పంపించు" అని ప్రార్థించాను. మూడవ రోజు మధ్యాహ్నం కూడ నేను భోజనం చేయలేదు. సాయంకాలం టీ తెప్పించుకొని త్రాగుతూ ఆలోచిస్తున్నాను. "ప్రభువా, నేను ఇల్లు విడిచి మూడు రోజులైంది. నేను బయలుదేరినప్పుడు ఇంట్లో ఏమీ లేవు. వాళ్ళు పస్తున్నారేమో" అని మనస్సులో మౌనంగా ప్రార్థించుకుంటున్నాను. ఆ క్షణమందే "నీవింటికి వెళ్ళి చూడు" అన్న స్వరము వినబడింది. నేను మొదట భయపడ్డాను. ఎందుకంటే నేను వున్న ప్రాంతంలో ఎవ్వరూ లేరు. అప్పుడు ఇది దేవుని స్వరమే అని తెలుసుకున్నాను. నా అవసరం ఇంట్లో ఏమన్నా వుందేమో అనుకొని ఆ రాత్రి సభానంతరం ఇంటికి వెళ్ళాలని నిర్ణయించుకున్నాను. "ప్రభువా! నేను ఈ రాత్రి ఇంటికి వెళ్ళాలంటే ఒక స్కూటరు గలవారిని ఇక్కడకు పంపించు" అని ప్రార్థన చేసుకున్నాను. ఆ రాత్రి ఒక కేరళ సహోదరుడు స్కూటరు తీసుకొని వచ్చాడు. ఆయనతో కలసి రాత్రి ఒంటిగంటకు నా ఇంటికి చేరాను. "రెబక్కా" అని కేకవేసి తలుపు తట్టగా ఆమె తలుపు తీశారు. తలుపు తీసిన వెంటనే ఒక బియ్యం బస్తా ఎదురుగా వుండటం చూసి "ఇదేమిటి?" అని అడిగాను. "బియ్యమండీ" అనింది. "ఎవరిచ్చారు?" అని అడిగాను. "ఏమో తెలియదు" అని చెప్పింది. "తెలియకుండా బియ్యమెలా వచ్చాయి?" అని అడిగాను. "ఒక రిక్షా ఆయన తలుపుతట్టి పరవస్తుగారిల్లు ఇదేనా? అని అడిగాడు. అవును అన్నాను. మాట్లాడకుండా రిక్షాలోనుండి బియ్యపు బస్తా దించి ఇంట్లో పెట్టి వెళ్ళిపోయాడు. ఒకవేళ మీరు పంపించారేమో అనుకున్నాను" అని చెప్పింది. "నిజమా, నేను పంపలేదే" అన్నాను. ఆ రాత్రి మేమిద్దరం దేవుని స్తుతించాము. దేవుడు నాతో "నీవు ఇంటికి వెళ్ళిచూడు" అని ఎందుకన్నాడో అర్థమయ్యింది. 'నీవడిగిన వెంటనే బియ్యం పంపించాను. అయినా ఇంకా బియ్యం, బియ్యం అని అస్తమానం మూడురోజుల్నుండి నన్నెందుకు విసికిస్తున్నావు? నీవడిగింది ఇచ్చానో లేదో నీవు వెళ్ళి చూడు' అని దాని భావము అని నాకిప్పుడే అర్థమయ్యింది. అడిగిన దానిని పొందాము అని విశ్వసించాలి మనం. మరుసటి రోజు ఉదయం నేను సభలకు హాజరయ్యాను.

ధారావాహిక

# నిత్యజీవజలము

3

అయితే అక్కడ వారికి భాష తెలియక అశ్రద్ధగా దానిని ఎక్కడో ఉంచాడు. తరువాత ఎంత వాకబు చేసినా దాని విషయమై ఏమి తెలియలేదు. చాలా ఆసక్తికరమైన మరియొక విషయం ఏమిటంటే బైబిల్ సొసైటీ వారు వేయించిన పుస్తకములో కెప్టెన్ డాడ్సు అనే ఆయన ఈస్ట్ ఇండియా కంపెనీలో పని చేస్తుండేవాడు. ఆయన ప్రభువుచేత ప్రేరేపింప బడి దీక్షతో భారతదేశ భాషలు నేర్చుకొని నూతన నిబంధనను తెలుగులోనికి తర్జుమా చేయ మొదలుపెట్టాడు. తను ఇంగ్లాం డుకు సెలవు మీద వెళ్ళు సమయం వచ్చినప్పుడు, ఆ సెలవులను బైబిల్ తర్జుమాకు వెచ్చింప నిర్ణయించి తన తల్లికి ఒక లేఖ వ్రాశాడు. ఆ లేఖలో "అమ్మా! నేనిప్పుడే సెలవులకు నీ దగ్గరకు రాలేకపోవు చున్నాను. ఎందుకంటే ఈ దేశ సహోదరుల ప్రయోజనార్థమై నేను పరిశుద్ధ గ్రంథమును వారి భాషలోనికి తర్జుమా చేయు చున్నాను. నన్ను పిచ్చివాడినిగా కొందరు భావించవచ్చు. అయితే నేనింత మంచి పనికి పూనుకున్నందుకు నీకు సంతోషమే. ఇంకొక ఏడాదిలో నేను పూర్తి తర్జుమా ముగించగలను. అమ్మా! నేను తలపెట్టిన ఈ కార్యము నెరవేర్చగలుగునట్లు ప్రార్థించు. ఈ లోకములో నాకు దీనిని మించినది వేరొకటి లేదు. ఈ కార్యమును తుదముట్టించుటలో నాకు ఏమి సంభవించినను నేను లెక్క చేయను" అంటూ ఒక ఉత్తరం వ్రాశాడు. ఈయన తన చిన్నతనం నుండి సువార్తను ప్రకటించుటలో చాలా ఆసక్తి చూపినందువల్ల తన మేనమామ కూడా మెచ్చుకుంటూ ఉండేవాడు. తను ఉద్యోగం నిమిత్తం ఇండియా వచ్చే సమయంలో "మహిమగల సువార్తను ఇండియా ప్రజల కిచ్చుటకే దేవుడు నిన్ను ఇండియా పంపుటకు నిర్ణయించెను" అని చెప్పాడంట. అయితే డాడ్సు వ్రాసిన ఆ ఉత్తరం తల్లికి చేరక మునుపే డాడ్సు చనిపోయాడు. అతడు చేసిన పని విలువ తెలియక తన తోటి ఉద్యోగులు ఆ వ్రాత ప్రతులను చిత్తు కాగితాల కట్టగా భావించి తగులబెట్టిరి. ఇలా ఇంకా ఎందరో బైబిలు భాషాంతరమునకు ఎన్నో వ్యయప్రయాస లను అనుభవించిరి.

సిరంపూరు మిషనరీలైన విలియంకేరి, మార్ష్‌మాన్, వార్డులను సిరంపూరు త్రిమూర్తులు అంటారు. వారు 1805లో నూతన నిబంధన తర్జుమా మొదలుపెట్టి అంతా సిద్ధంగా వున్న సమయంలో 1812లో ముద్రణాలయముకు నిప్పు అంటుకొని వ్రాతప్రతులు, అచ్చులు, కాగితాలు అన్నీ కాలిపోయాయి. తదుపరి ప్రయత్నంలో నూతన నిబంధన, పాతనిబంధనలోని పంచగ్రంథములను, తెలుగులోనికి అనువదించి ముద్రించిరి. లండన్ మిషన్‌కు చెందిన ఇద్దరు మిషనరీలు జార్జిక్రాన్, అగస్టీన్ డిగ్రాంగ్‌లు విశాఖపట్టణం చేరి తెలుగు అనువాదము మొదలుపెట్టిరి. ఈ పనిలో ఆసక్తి చూపి డిగ్రాంగ్ తన మిషనరీ మిత్రులకు ఉత్తరం వ్రాస్తూ, మిగిలిన పనుల కంటే బైబిల్ భాషాంతరమునకే ప్రాధాన్యమి య్యవలెనని వ్రాసియున్నాడు. ఈ భాషాంతరము చేయు పనిలో ఆనందనాయర్ సహాయము తీసుకున్నాడు. ఈయన బ్రాహ్మ ణుల నుండి క్రైస్తవుడాయెను. డిగ్రాంగు గ్రీకు భాషలో నుండి ఆనందరాయర్ తమిళము నుండి నూతన నిబంధనను తర్జుమా చేసి వారిరువురు చేసిన పనిని సరిచూసుకొని తెలుగు ప్రతిని సిద్ధము చేశారు. డిగ్రాంగ్ ఈ పనిలో అనేక ప్రయాసలు పడుతూ తను మరణించు సమయంలో చివరి మాటలలో "భాషాంతరము చేయుటకే నేను బ్రదికియుండనవసరం లేదు. నేను లేకపోయినప్పటికీ ప్రభువు ఈ పనిని కొనసాగించును" అని పలికెను. ఆలాగుననే ఆ పని ఆగలేదు. ఆనందనాయర్, జాన్‌గోర్డన్ అను మరియొక మిషనరీ కలసి తెలుగు నూతన నిబంధనను మద్రాసులో ముద్రించిరి. తరువాత కొన్ని పాత నిబంధన పుస్తకములు కూడా తెలుగులోనికి అచ్చు వేయ బడినవి. 1844లో ఒక సభ ఏర్పాటు చేయబడెను. అప్పటికి వాడుకలో వున్న భాషాంతరములను సరిచేసి అందరికీ ఆమో దంగా వుండునట్లు ఒక కూర్పును సిద్ధము చేయుటకు నిర్ణ యించి 1857 నాటికి ఒక పూర్తి తెలుగు బైబిల్‌ను సిద్ధము చేసిరి. 1857లో మొదటిగా పూర్తి పాతనబంధన తెలుగులో అచ్చువేయబడినది. (మిషనరీలే కాక మద్రాసులో సివిల్ సర్వీసులో వున్న సి.పి.బ్రౌన్ కూడా సొంతంగా బైబిల్‌ను తెలుగులోకి తర్జుమా చేశాడు. ఈ తెలుగు బైబిలు ప్రతి ఇప్పటికీ లండన్ బైబిల్ హౌస్‌లో ఉందంటారు. ఈయన గొప్ప

పండితుడు. ఆయన తయారు చేసిన తెలుగు-ఇంగ్లీషు, ఇంగ్లీషు-తెలుగు నిఘంటువులు ఇప్పటికీ వాడుకలో వున్నవి). 1865లో మద్రాసు సహాయ సంఘము వారు ఒక కమిటీని నియమించి ఈ బైబిలును సవరించవలెనను ఉద్దేశముతో జాన్ హేగారి సహాయంతో 1884లో సరిచేయబడిన బైబిల్ ముద్రించబడింది.

తర్వాత రెవ.డి.అనంతం, బి.సిన్నయ్య, ఇ.లూయిస్, జె.ఆర్.బేకన్‌ల సహాయంతో 1904లో ఒకసారి, 1911లో ఒకసారి సవరించబడెను. మొత్తం మీద ఈ బైబిల్ భాషాంతరము అన్ని సంఘముల ఆమోదం పొందెను. ఆ తర్వాత సవరణలు ఏమీ జరుగలేదు. అయితే 1913,14 సంవత్సరాలలో ఏలూరు సమీపంలోని లక్కవరం జమిందారు రాజా భుజంగరావుగారు నూతన నిబంధనలోని సువార్తలు, రోమా, గలతీ పత్రికలను కావ్యరూపములో ప్రకటించెను. 1941లో రెవ.డబ్ల్యు.బాగ్స్‌గారిచే తెలుగు రెఫరెన్సు బైబిల్ ప్రచురింపబడింది.

తెలుగు బైబిలు మొత్తం ఆదిమ, హెబ్రీ, గ్రీకు భాషల నుండి భాషాంతరము చేయబడినందున దోష రహితంగా ఉన్నది. కాని ఆంధ్రక్రైస్త సభవారు, అప్పటి హైదరాబాదు క్రైస్తవ సభవారు ఆలోచించి అన్ని సంఘముల ప్రతినిధులను సమకూర్చి తెలుగు బైబిలును పూర్తిగా పునర్విమర్శ చేయనవసరం లేదని నిర్ణయించారు.

మద్రాసు సహాయ సంఘము నాయకత్వాన సవరణ కమిటీ ఏర్పడి భాషా దోషములను దిద్ది కఠినమైన పదాలను సులభపరచి 1952లో అచ్చువేయించిరి. అదే ఇప్పుడు మనం వాడుతున్న బైబిలు.

1920-1923లో తెలుగు బైబిల్స్ చాలా కరువులో వుండేవి. ఆ రోజులలో తెలుగు బైబిలును ఆసక్తిగా ఎత్తి వ్రాసిన వారున్నారు. 1852లో క్రొత్త నిబంధన ప్రతులేవీ మద్రాసులో లేవు. దేవుని మహాకృప వలన మనము కొనగలిగే ధరలో మనకు బైబిలు లభిస్తున్నందుకు ఆయనకు మనం స్తుతులు చెల్లించాలి. దీనికొరకై అనేక వ్యయ ప్రయాసలు పడుచున్న సంస్థల కొరకై ప్రార్థించాలి. వాక్యమును భక్తితోను, వణకుతోను చదివి ఆత్మీయ జీవితములో మేలులు పొందాలి. ఈ వాక్యమునకు ఎవరు ఎన్ని వ్యాఖ్యానాలు వ్రాసినా, చదివేటప్పుడు దేవుడు నీతో నాతో మెల్లని స్వరముతో పలికే పలుకులను అర్థం చేసుకొని, జీవితములకు అన్వయించుకోవాలి.

"వాక్యము చీకటిగల చోట వెలుగిచ్చు దీపమైనట్టున్నది. దానియందు మీరు లక్ష్యముంచిన యెడల మీకు మేలు" 2పేతురు 1:9. "నీ వాక్యము నా పాదములకు దీపమును నా త్రోవకు వెలుగునైయున్నది" కీర్త.119:105. ఈ పరిశుద్ధ వాక్యములు దేవుని వాక్యములు అని చెప్పడానికి ఏవైనా నిదర్శనాలు ఉన్నవా? అంటే నేను తెలుసుకున్న, నేను నమ్మిన కొన్ని విషయములను మీతో పంచుకోవాలను కుంటున్నాను.

ఈ 66 పుస్తకముల కలయిక అయిన బైబిలు దాదాపు 40 మంది దేవుని భక్తులు దాదాపు మూడు భాషలలో 1600 సంవత్సరాల మధ్యకాలంలో వ్రాయబడిన దీనిలో ఉన్న ఒకే ఒక ఉద్దేశ్యము "క్రీస్తు ద్వారా సర్వమానవాళికి రక్షణ".

"ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛనుబట్టి కలుగలేదుగాని మనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింప బడినవారై దేవుని మూలముగా పలికిరి" 2పేతురు 1:21. ఈ విధంగా పలికిన మాటలు తర్వాత కాలములో మట్టి పలకల మీద, జంతు చర్మముల మీద వ్రాయబడి భద్రపరచ బడినవి. ఇవి బబులోను ప్రాంతములలో కనుగొనబడినవి. ఈ వ్రాత ప్రతుల చుట్టలో ఒక బైబిల్ పుస్తకములోని కొంత భాగము మాత్రమే సరిపోతుంది. అంటే కొన్ని వందల వ్రాత ప్రతులు భద్రపరచబడ్డాయి. ఈ వ్రాత ప్రతులు భద్రపరచబడి, వాటిని తిరిగి కాపీ చేయడంలో కూడా దేవుడు తన వాక్యమును మనకు భద్రపరిచాడని చెప్పగలము. "యెహోవా సెలవిచ్చునదేమనగా", "సైన్యములకు అధిపతియగు యెహోవా సెలవిచ్చునదేమనగా", "ఇదే యెహోవా వాక్కు", "యెహోవా యొద్ద నుండి వచ్చిన సమాచారము" ఈ విధంగా పాత నిబంధనలో అనేక మార్లు వ్రాయబడియుంది. క్రొత్త నిబంధనలో అపొస్తలుడైన పౌలు తిమోతికి వ్రాస్తూ లేఖనములను "దైవావేశము వలన కలిగిన లేఖనములు" అని వర్ణించాడు 2తిమో.3:16,17. అలాగే పేతురు కూడా "మనుష్యులు దేవుని వలన ప్రేరేపింపబడి పలికిరి" అని వ్రాశాడు 2పేతు.2:21.

యేసుక్రీస్తు తన సువార్త సేవాకాలంలో ధనాపేక్షగల పరిసయ్యులతో మాట్లాడుతూ "ధర్మశాస్త్రములో ఒక పొల్లైన తప్పిపోవుట కంటే ఆకాశమును భూమియు గతించిపోవుట సులభం" (లూకా16:17) అని ధర్మశాస్త్రం యొక్క ఔన్నత్యాన్ని చాటుతున్నాడు. యేసయ్య తన శిష్యులతో "అంతమును" గూర్చి మాట్లాడుతూ లేఖనములలో వ్రాయబడినవన్నియు నెరవేరుటకై" (లూకా 21:22) అనే మాట వాడియున్నాడు.

# శాశ్వత రక్షణ

## (రక్షణ యొక్క శాశ్వత భద్రత)

రోమా 8వ అధ్యాయం ముగింపులో వ్రాయబడిన ఈ అద్భుతమైన ఉత్సాహపరచే, ఆదరణకరమైన వాక్యాలు గమనించండి. “మరణమైనను, జీవమైనను, దేవదూతలైనను ప్రధానులైనను, ఉన్నవియైనను, రాబోవునవి అయినను, అధికారులైనను, ఎత్తయినది అయినను, లోతైనది అయినను, మన ప్రభువునందలి దేవుని ప్రేమ నుండి మనలను ఎడబాప నేరవని రూఢిగా నమ్ముచున్నాను. పరిశుద్ధాత్మ దేవుడే సృష్టి నంతటిని గాలించి, ఏర్పాటు చేసుకొని, పిలువబడి, నీతి మంతులుగా తీర్చబడిన వారిని దేవుని ప్రేమనుండి వేరుచేసేది సృష్టిలోనే లేదని పౌలుచేత పలికించారు.

### 1యోహాను 5:6-13

ముందు చెప్పబడిన వివరములు కొన్ని మరల ఈ భాగములో చెప్పబడినను వాటిని పరిశీలించుట మనకు మంచిది. యోహాను 20:30లో యేసే రక్షకుడని దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్లును నమ్మి ఆయన నామమునందు జీవము పొందునట్లు వ్రాయబడినవని యోహాను భక్తుడు వ్రాశాడు. మరియు మీ సంతోషము సంపూర్ణమగుటకై ఈ సంగతులు వ్రాయుచున్నామని 1యోహాను 1:4లో వ్రాయబడినది. ఇప్పుడు అపొస్తలులు వ్రాసినవి జాగ్రత్తగా పరిశీలించుదాము. సత్యమైన ఆత్మ యేసే రక్షకుడని సాక్ష్యం చెప్తుంది (1యోహా. 5:6). ఆత్మ యొక్క సాక్ష్యమే దేవుని యొక్క సాక్ష్యము. మనము మనుష్యుల సాక్ష్యము నమ్ము చున్నాము గదా! మరి దేవుని సాక్ష్యము అంతకంటే గొప్పది కాదా! తన (దేవుని) కుమారునియందు విశ్వాసము ఉంచిన వాడు తనలోనే ఈ సాక్ష్యము కలిగియున్నాడు (1యోహా. 5:9,10). విశ్వసించనివాడు (నమ్మనివాడు) దేవుని అబద్ధికు నిగా చేయుచున్నాడు. ఎందుకనగా కుమారుని గూర్చి సత్యవంతుడగు దేవుడు ఇచ్చిన సాక్ష్యము అతడు నమ్మలేదు (1యోహా. 5:9,10; రోమా 8:16). దేవుని యొక్క సాక్ష్యము ఏమనగా దేవుడు మనకు నిత్యజీవము దయచేసెను. ఈ జీవము ఆయన కుమారునియందు ఉన్నది (11వ). దేవుని కుమారుని అంగీకరించువాడు జీవముగలవాడు. దేవుని కుమారుని అంగీకరింపనివాడు జీవము లేనివాడే (12వ). 9-12 వరకు వ్రాయబడిన వచనములు దేవుని కుమారుని నామమందు విశ్వాసముంచు మీరు నిత్యజీవము గలవారని తెలుసుకొను నట్లు వ్రాయబడినవి (13వ). దేవుడు తన కుమారుని గురించి ఇచ్చిన సాక్ష్యము అనగా నిత్యజీవము తన కుమారునియందు వున్నది అను సత్యము మనము నమ్మవలసినదిగా పై సంగతులు వ్రాయబడినవి. కాబట్టి విశ్వాసులుగా క్రీస్తును కలిగి యున్న మనము నిత్యజీవములో భద్రపరచబడియున్నాయని చెప్పుటకు దేవుడు తన కుమారుని గూర్చి ఇచ్చిన సాక్ష్యమే ఆధారము. కాని మన పరిస్థితులు కాదు.

క్రీస్తు యొక్క మూర్తిత్వము గురించి మరల నొక్కి చెప్పవలెనని తలంచుచున్నాను. 1యోహాను 5:11 వచనంలో “ఆ సాక్ష్యము”, “ఈ జీవము” అనే మాటలను గమనించాలి. “ఆ” లేక “ఈ” అనే మాటలు భాషా వాచకములు. “ఆ సాక్ష్యము” అనగా ఒక ప్రత్యేకమైన సాక్ష్యమును గూర్చి, “ఈ జీవము” అనగా ఒక ప్రత్యేకమైన జీవముగూర్చి నొక్కి చెప్పుచున్నదన్న మాట! దేవుడు తన కుమారుని మనకు అనుగ్రహించెను. అంటే కుమారునితో పాటు కుమారుని యందు ఉన్నవన్నీ కూడా మనకు అనుగ్రహించాడన్న మాట. మన భారతదేశంలో పెండ్లి కుమార్తె పెండ్లి కుమారుని ఇంటికి వెళ్ళిందంటే ఆమెతో పాటు ఆమెకున్న ఆస్తిపాస్తులన్నీ భర్తకు సంక్రమిస్తాయి. లేక ఎవరైనా మనకు ఒక ప్యాకేజీని మంచి విలువైన కవరులో పెట్టి ఇచ్చినట్లయితే కవరుతోపాటు ఆ ప్యాకేజీలో వున్నవన్నీ మనకే సంక్రమిస్తాయి. అదేవిధంగా కుమారుని పొందిన మనము కుమారునితోపాటు కుమారునిలో వున్న నిత్యజీవము కూడా పొందుతాము (1యోహా. 1:4). అసలు యేసుప్రభువే తనను గూర్చి తాను చెప్పుకున్న సాక్ష్యం ఏమంటే “నేనే పునరుత్థానమును జీవమునై ఉన్నాను” (యోహా. 11:25). యోహాను 14:6లో కూడా నేనే జీవమును అని చెప్పాడు. “నేనే” అంటే నేను తప్ప ఇంకెవరూ లేరని తానే జీవమునకు ఉనికి అని అర్థం. కొలస్సీ. 3:4లో పౌలు “మనకు జీవమైయున్న యేసు” అని వ్రాశాడు. అంటే మూర్తి అయిన క్రీస్తే మనకు జీవమని భావము. ఇప్పుడు మనము 1యోహా. 1:2లో యోహాను భక్తుడు చెప్పిన గొప్ప సాక్ష్యమును

చూద్దాం. అదేమంటే ఆదియందు దేవుని వద్ద వున్న వాక్యము వారు (శిష్యులు) కన్నులారా చేతులతో తాకి చూశారు, నిదానించి కనుగొన్నారు. చెవులతో విన్నారు. "ఆదియందు వాక్యముండెను. వాక్యము దేవుని యొద్ద ఉండెను (యోహాను 1:1). వాక్యము దేవుడైయుండెను. ఆ వాక్యమే శరీరధారిగా (యేసుక్రీస్తు) మన మధ్య నివసించెను (యోహాను 1:14). తండ్రితో వున్న నిత్యజీవము మన మధ్య యేసుక్రీస్తుగా ప్రత్యక్షమైనది. ప్రత్యక్ష సాక్షులైన శిష్యులు వినినది, నిదానించి చూచినది, చేతులతో తాకినది ఈ నిత్యజీవమైన యేసునే (1యోహా. 1:1,2).

మనము తిరిగి జన్మించినపుడు క్రీస్తు మనలోనికి ప్రవేశించియున్నాడని మనమందరము నమ్ముచున్నాము. యోహాను 3:6లో చెప్పిన విధంగా మన ఆత్మ, పరిశుద్ధాత్మ ద్వారా తిరిగి జన్మించినపుడు మనకు జీవమైన క్రీస్తు మనలో ప్రవేశించాడని అర్థము. మన కొరకు, మనలో ప్రవేశించాడు. కనుకనే "కుమారుని కలిగినవాడే (అంగీకరించువాడే) జీవము గలవాడు అని యోహాను భక్తుడు వ్రాశాడు (యోహాను 2:1; 5:12; 3:2-6; 14:20, 2కొరింథీ. 13:5, గలతీ.2:20, ఎఫెసీ.3:17, కొలస్సీ.1:27). "దేవుని కుమారుని నామమందు విశ్వాసముంచు మీరు నిత్యజీవము గలవారని తెలుసుకొనునట్లు ఈ సంగతులు వ్రాయుచున్నాను" అని యోహాను భక్తుడు 1యోహా.5:13లో తెలియజేశాడు.

గ్రీకు భాషలో జ్ఞానము అను విషయము తెలుపుటకు చాలా పదాలు వున్నాయి. ఈ పదాలన్నంటిని ఇంగ్లీషు భాషలో "తెలుసుకొనుట" లేక "ఎరుగుట" అనే మాటలోనికి తర్జుమా చేయబడినవి. 1యోహా.5:13లో వాడబడిన "తెలిసికొనునట్లు" అని వ్రాయబడిన మాటకు "స్థిరమైన అంతరంగ జ్ఞానము" అనగా క్రీస్తు యేసుని కలిగిన మనము "పోగొట్టుకొనని జీవము" అంటే నిత్యము ఉండే జీవము గలవారమని తెలుసుకొనునట్లు అని అర్థము. మరల మరల వ్రాయుచున్నందుకు దయచేసి క్షమించండి. ఈ నిత్యజీవము (ఎల్లప్పుడూ ఉండే జీవము) స్థిరమైనది. దాని నుండి మనము వేరు చేయబడము. మన జీవము క్రీస్తుతో కూడ దాచబడి ఉన్నది (భద్రపరచబడియున్నది). ఇది సత్యము. ఈ గొప్ప సత్యమునందు నమ్మకం వుంచి ఆనందించండి, ఉజ్జీవము పొందండి. ఆఖరిగా తన పత్రికను సంక్షిప్త పరుస్తూ యోహాను భక్తుడు ఈలాగు వ్రాస్తున్నాడు. మనము సత్యవంతుడైన వానిని ఎరుగవలెనని దేవుని కుమారుడు వచ్చి మనకు వివేకము అనుగ్రహించియున్నాడని ఎరుగుదుము. మనము దేవుని కుమారుడైన యేసుక్రీస్తు నందున్న వారమై సత్యవంతుని యందున్నాము. ఆయనే నిజమైన దేవుడును నిత్యజీవమునై యున్నాడు (1యోహాను 5:20). కనుక మనకు ఇంతవరకు అర్థమైనది ఏమంటే నిత్యజీవమనునది మన విశ్వాసము ద్వారా దేవుని కృపచేత దైవ వరంగా (దానముగా) ఇవ్వబడినదేగాని క్రియల వలన కాదని స్పష్టమైనది (ఎఫెసీ. 2:8).

ఇప్పుడు మనము విశ్వాసులైన వారి యొక్క రక్షణ పూర్తి భద్రత (శాశ్వత భద్రత) కలిగియున్నది అనే విషయాన్ని అనుమానించి తప్పు త్రోవపట్టించే కొన్ని ముఖ్యమైన అంశాలను పరిశీలిద్దాము. రెండు ముఖ్యమైన సత్యముల విషయంలో అపార్థం జరుగుచున్నది. "పరలోక రాజ్యము", "నిత్యజీవము". రక్షింపబడినవారు పునరుత్థానములో మొదట పరలోక రాజ్యము, తరువాత నిత్య జీవములో ప్రవేశిస్తారు అని సరిగా గ్రహించకపోవుట.

**1. "నిత్యజీవము - పరలోకరాజ్యము" :** అను ఈ రెంటిని గూర్చి సరైన వివరణ తెలుసుకోలేక ఒకదానికి ఇంకొకటి కలిపి బోధించుట. ముందు మొదటి దాని గురించి ఆలోచిద్దాం.

**2. నిత్యజీవము :** ఇది క్రియల వలన ఏ మాత్రము కాదు. విశ్వాసము ద్వారా కృపచేతనే పొందుచున్నాము అనే సత్యము సరిగా గ్రహించకపోవడం.

నిత్యజీవమనగా మానవుడు పొందే ఒక స్థితి. దీనిని మన విశ్వాసమునుబట్టి దేవుని కృపవలన వరముగా పొందుచున్నాము. రక్షించబడిన వారందరూ రక్షణ పొందిన క్షణమే ఈ స్థితిని పొందుతారు. ఈ విషయము ముందు వ్రాసిన వాక్యాలలో విశదపరచబడింది. దీనికి అంతము లేదు. ఇది "పరలోకరాజ్యము" కాదు. పరలోకరాజ్యములో జరిగే సంగతులు నిజ్యజీవములో జరుగుతాయని, నిత్యజీవములో జరిగేవి పరలోకరాజ్య (వెయ్యేండ్ల) పరిపాలనలో జరుగుతాయని బోధ జరుగుతుంది. అందుకే గందరగోళ పరిస్థితి ఏర్పడింది. నిత్యజీవమును పరలోకరాజ్యముగా బోధించుట వలననే విశ్వాసులకు తికమక జరుగుతుంది. ఈ నిత్యజీవము అనేది రాజ్యము కాదు. ఇది ఒక స్థితి.

సీరియల్

# మహా యజ్ఞమ్

8

**"మానస యాగం నిస్పాదిత వంత...**
**ప్రజాపతి ప్రాణ రూప యజ్ఞేన**
**యతోక్తేన మానసేన సంకల్పేన యజ్ఞం"**

**భావము :** అక్షరాల ఈ యజ్ఞం దేవలోకంలో జరిపింప బడలేదు. అయితే, మానవ రక్షణార్ధమై భగవంతుడు శాశ్వత పరిపూర్ణ యజ్ఞానికిది ఒక నమూనాయేనని చెప్పబడింది. ఇదొక దేవుని మానసిక లేదా చిహ్నార్ధమేనని మరో వ్యాఖ్యాత తెలిపాడు. దేవలోక నివాసులకు పాపపరిహారార్ధ బలి అవసరం లేదు. దేవలోకంలో వున్నారు గనుక. అయితే భూలోక మానవుడు తన పాపచర్యచే భగవంతునికి దూరమై యున్నాడు గనుక వాని పాప ప్రాయశ్చిత్తార్ధం, పరిపూర్ణ పురుష బలియాగం ఆవశ్యకమై వుంది.

వాస్తవానికి దేవుడు మానవ వర్గాన్ని నిర్మించక మునుపే దాని రక్షణ నిమిత్తమైన ప్రణాళికను సిద్ధపరిచాడు. లోకం నిర్మింపబడినప్పుడే వధకు తేబడిన గొఱ్ఱెపిల్ల యజ్ఞ నైవేద్య మయ్యాడు. మానవ రక్షణార్ధమైన దేవుని శాశ్వత నమూనా ప్రణాళికదే. అది స్వర్గంలో సుస్థిరమై వుంది. కాబట్టి, ఇది యజ్ఞం యొక్క ప్రధమస్థితి.

### ఆ యజ్ఞం భూగ్రహంలోకి అరుదెంచింది

దైవం మానవావతారం ధరించడం సనాతన ఇండియా ప్రజాళికి పరాయి విషయం కాదు. ఈ భావం వారి హృదయాల్లో చాలా లోతుగా వేరూరి వుంది. తత్ఫలితంగా ఋషి పుంగవులు ఈ సిద్ధాంతాన్ని వేదాలు, ఉపనిషత్తులలో అనేక విధాలుగా వ్యక్తపరిచారు. అశ్వత్థా వృక్షం, స్వర్గం నుండి క్రిందికి వచ్చింది.

కఠోపనిషత్తులో ఒక వచనం 'దైవం మానవ అవతారం దాల్చాడు' గురించి ఇలా అభివర్ణిస్తుంది. అది అందమైన, శక్తివంతమైన రూప వర్ణనం.

**"ఊర్ధ్వమూలా అవాక్శాఖాయశో**
**అశ్వత్థా సనాతనహా -**
**తదేవ శుక్రం తద్బ్రహ్మా తేదేవామృతవు స్యయతే**
**తస్మిన్ ల్లోకాశ్రితః సర్వేతద్ నాత్యతి**
**కస్య నె తద్ వైతద్" -**

'హిందూ పవిత్ర గ్రంథం' అనే పుస్తకం నుండి పై వచనార్ధం చూద్దాం. వేర్లు, కొమ్మల ఊర్ధ్వ ముఖంగా వున్న (ఇది బ్రహ్మను సూచిస్తుంది) ఒక పురాతనమైన అశ్వత్థా వృక్షం, వాస్తవంగా అది వెలుగుమయమైనది. అంటే బ్రహ్మం వినాశంలేనివాడు. ఆయనలో అన్ని లోకాలు అమరి ఉన్నాయి. ఏదీ ఆయనను అధిగమించదు. ఇదే అది. ఈ అభివర్ణన ఒక సాధారణ వృక్షమును గూర్చి కాదు. ఈ అశ్వత్థా తరువు శాశ్వతమైనది. ప్రకాశవంతమైనది. 'శుక్రం' అంటే ప్రకాశమై నదేకాక పవిత్రమైనదని కూడా అర్ధం వుంది. మరి, పరిశు ద్ధుడు, నిత్యమైన వాడు ఎవరు? 'బ్రహ్మ' అని ఆ వచనంలోనే వుంది. బ్రహ్మ అంటే భగవంతుడు అని అర్ధం. అనగా అశ్వత్థా వృక్షం. భగవంతునికి సూచనగా పేర్కొనబడింది. ఇతర ముఖ్య మైన లక్షణాలు. ఇది తలక్రిందులుగా వున్న తరువు. దాని వేర్లు ఆకాశంపైపు పెరిగాయి. కొమ్మలు భూమిపైకి ప్రాకాయి. నేలమీద వ్యాపించాయి. భూమి యొక్క పోషక పదార్ధాలపై ఆధారపడి పెరుగుతున్నాయి. అయితే ఈ దైవిక వృక్షం అద్వి తీయమైనది. ఆకాశంవైపు వేర్లు పెరగడం వలన స్వర్గ లోకాహారాన్ని తీసుకుంటుంది. దీని ఫలం భూమిపై కనబడు తుంది. దీనలోనికి మాధుర్యం దేవలోకం నుండి వస్తుంది.

### వృక్షం యొక్క ఇతర లక్షణాలు

ఆయనలో లోకాలన్నీ ఇమిడి వున్నాయి. ఆయనను ఎవ్వరూ అధిగమించలేరు. లోక ప్రజలకు శాశ్వతాశ్రయం ఇవ్వడానికి, భూమిపై ప్రత్యక్షమౌతాడాయన. నరావతార అభి ప్రాయాన్ని ఈ వచనం వెల్లడిస్తుంది. మానవ రక్షణార్ధం బ్రహ్మ ఈ భువనంలో తన దైవిక లక్షణాలను, నిత్యజీవముగల రూపాంతరాన్ని ప్రత్యక్షపరచుకున్నాడు. పాపం చేసి దేవుని మహిమకు దూరమైన మానవుని రక్షణ కొరకైన, సత్యమైన మార్గం కూడ ఇదేనని ఋజువైనది. యోహాను శుభవార్త ప్రధమాధ్యాయంలో యేసు యొక్క అవతార విశేషాన్ని మనం చూశాము. "ఆయన ఆది నుండి వున్నాడు. రానున్నకాలం లోనూ వుంటాడు. ఈ భూమండలం పైకి దేవలోకం నుండి దిగివచ్చాడు". పైన పేర్కొన్న విషయాలన్నీ యేసుప్రభువుకు చెందినవే.

అశ్వత్థా వృక్షం ఆకాశం నుండి భూమికి వచ్చింది. "నేను పై నుండి వచ్చిన వాడను" (యోహా. 8:23) అని యేసు అన్నాడు. ఇదే యోహా. 6:51లో యేసు, "పరలోకం నుండి

దిగివచ్చిన జీవాహారం నేనే. ఈ ఆహారమును భుజించిన ఎవరైనను నిత్యం జీవించి ఉంటారు. వారికి నేనిచ్చు ఆహారము, లోకము యొక్క జీవము కొరకైన నా శరీరమే" అని వక్కాణించాడు. ఈ వాక్యాల ద్వారా యేసు తన అవతారము పరిత్యాగపరమైన సిలువ మరణాలను వ్యక్తీకరిస్తున్నాడు. కాబట్టి నిజంగా యేసును అశ్వత్థా వృక్షానికి అనువర్తించడం న్యాయమైనదే. అశ్వత్థా వృక్షం పరబ్రహ్మం. ఆ పరబ్రహ్మమే యేసుక్రీస్తు. ఈ యేసుక్రీస్తే లోక రక్షకుడైన సర్వేశ్వరుడు. ఇది నిర్వివాదాంశం.

### "మెస్సియాయే పురుష"

పూర్వపు మానవ చరిత్రను గమనిస్తే మనుష్యజాతి ఒక రక్షకుని కోసం నిరీక్షించేది. పాత నిబంధన గ్రంథ ప్రవచనం ప్రకారం మెస్సియ్య వస్తున్నాడని ప్రబోధించింది. యేసు జననానికి 700 సంవత్సరాలకు పూర్వం యెషయా ప్రవక్త యేసు జననం గురించి "కాబట్టి, ప్రభువైన యెహోవా నీకనుగ్రహించు ఆనవాలు ఇదే. కన్యక గర్భము ధరించి కుమారుని కనును. ఆయనకు ఇమ్మానుయేలు అను పేరు పెట్టబడును" (యెషయా 7:14) అని ప్రవచించాడు.

ఇశ్రాయేలీయులు మెస్సియా కోసం ఎదురు చూస్తూ ఉండేవారు. యూదా మతస్తులు ఇంకా ఎదురు చూస్తున్నారు. అయితే అనేకమంది యూదులు మెస్సియలోని గుణగణాలను యేసులో గ్రహించి ఆయన అనుచరులుగా మారారు. సుమెయోను యెరూషలేముకు చెందిన నీతిమంతుడైన వృద్ధుడు. మెస్సియ కొరకు ఆసక్తితో ఎదురు చూస్తూ వుండేవాడు. ఈ సంధర్భంలో "అతడు క్రీస్తును చూడక మునుపు మరణము పొందదని అతనికి పరిశుద్ధాత్మచేత బయలుపరచబడెను" (లూకా 2:26). అంతట ఆయన దేవాలయములో ప్రవేశించి ఆత్మవశుడై ధర్మశాస్త్ర పద్ధతి చొప్పున జరిగించుటకు శిశువైన యేసును తన చేతులలోకి ఎత్తుకొని దేవుని స్తుతించుచూ, నాథా! ఇప్పుడు నీ మాట చొప్పున సమాధానముతో నీ దాసుని పోనిచ్చుచున్నావు. అన్యజనులకు, నిన్ను బయలుపరచుటకు వెలుగుగాను నీ ప్రజలైన ఇశ్రాయేలీయులకు మహిమగాను నీవు సకల ప్రజల యెదుట స్థిరపరచిన నీ రక్షణ నేను కన్నులారా చూచితిని" అని పలికాడు (లూకా 2:28-32). తూర్పుదేశ ప్రజలు కూడ రక్షకుని కొరకు నిరీక్షిస్తుండేవారు. వారాయనను 'నిష్కళంక పురుష' అంటే పాపరహితుడు అని వ్యవహరించారు. ఆ కారణం వల్లనే తూర్పు దేశ జ్ఞానులకు ఆయన నక్షత్రం ద్వారా క్రీస్తు జననం తెలుపబడింది. మత్తయి సువార్త 2వ అధ్యాంలో ఈ విషయాన్ని మనం చదువుకోవచ్చు.

### నరకబడిన వృక్షం - యజ్ఞార్పణ పురుష

అశ్వత్థా వృక్షం, పురుష ప్రజాపతి ఒకే భావన కలిగిన పదాలే. మానవ రక్షణార్థమైన అవతారాభిప్రాయాన్ని తెలిపే పదాలివి. అశ్వత్థా వృక్షము యొక్క మరొక పేరు 'వనస్పతి', 'వృక్షజాతి ప్రభువు' అని దీని అక్షరార్థం. దారణ్య ఉపనిషత్‌లో వచనం చూద్దాం.

**"యధా వృక్షో వనస్పతి**
**స్థైవ పురుషో అమ్రస"**

**భావము :** వృక్షాలకు వనస్పతి ఎలాగో పురుష కూడా అలాగే. ఇది వాస్తవం. ప్రతి వృక్షానికి వనస్పతి ఏ విధంగా గొప్పదో, అదే విధంగా ప్రపంచలో ప్రతివానికీ, పైవాడే పురుష. ఉపనిషత్తులో తరువాత వచనం ఏమంటున్నదంటే నరకబడిన చెట్టు నుండి జిడ్డు ద్రవము కారుతున్నట్లు, గాయపరచబడిన మనిషి నుండి రక్తం స్రవిస్తుంది.

**"త్వక ఎవశ్య రుధిరం**
**ప్రశ్యంది త్వక ఉత్పాత**
**తస్మా త్తదా త్రున్నాత ప్రైతి**
**రసో వృక్షాది వాహతాత్"**

**భావము :** పురుష చర్మము నుండి రక్తం స్రవిస్తుంది. వృక్షం నుండి వనస్పతి కారుచున్నది. కాబట్టి నరకబడిన చెట్టు నుండి జిడ్డు ద్రవం కారుతున్నట్లు గాయపడిన మనిషి నుండి రక్తం స్రవిస్తుంది. ఋగ్వేదంలోని పురుష సూక్త వచనాలకు, ఈ సంధర్భాన్ని పోల్చి చూస్తే పురుష ప్రజాపతి, బల్యర్పణ సంబంధం కలిగి వుంది.

మెస్సియా చంపబడును. ఇది దానియేలు యొక్క ప్రవచనం. 'ఆత్మాభిషిక్తుడైన మెస్సియా చంపబడును' అని క్రీస్తుకు పూర్వం 600 సంవత్సరాల పూర్వం దానియేలు ప్రవక్త ప్రవచించాడు. సంహరింపబడును అనే పదాలను ఉపయోగించాడు. ఇది యేసుప్రభువు యొక్క బల్యర్పణకు తార్కాణ మైనది. ఇది సంభవమయ్యే, సరైన సమయాన్ని కూడా ఆయన పేర్కొన్నాడు (దానియేలు 9:26). యెషయా ప్రవక్త కూడ యేసు యొక్క యజ్ఞార్పణను గురించి ఇవే మాటలు ఉపయోగించాడు. "జీవముగల భూమి నుండి అతడు తొలగింపబడును" (యెష. 53:8).

సీరియల్ 7

# అత్యంత ప్రియమైన అమ్మ

## (దేవుని బలిష్ఠమైన చేతిలో దీనపాత్ర కీ.శే. శ్రీమతి వై.యస్. జయమ్మ)

మా మూడవ అన్న వివేకానందరెడ్డి 18 సంవత్సరాల ప్రాయంలో బావిలో పడిపోయాడు. అప్పుడు అతని కాలు విరిగి పైకి రాలేకపోయారు. ఆ సమయంలో అందరూ భయపడిపోయారు. అప్పుడు మా తండ్రి కూడ ఇంట్లో లేరు. యేసునందు అత్యంత విశ్వాసముంచిన మా తల్లి ప్రార్థన చేయడం ప్రారంభించింది. దేవుడు మా తండ్రి స్నేహితుడైన గురివిరెడ్డిని ఆ స్థలానికి పంపాడు. అతడు మా అన్నను బావిలో నుండి బయటకు తీశాడు. మా తల్లి అడుగుజాడల్లో నడవాలని మా అన్న భార్య శ్రీమతి సౌభాగ్య ఎంతగానో ప్రయాసపడుతూ వుంది.

నాల్గవ వాడైన నా తమ్ముడు సుధీకర్‌రెడ్డి దాదాపు 13 సంవత్సరాల ప్రాయంలో అసాధారణమైన ప్రమాదానికి గురయ్యాడు. అతడు పాఠశాల ఆటస్థలంలో అడుకుంటున్నప్పుడు చేతి ఈటె వచ్చి నొసలుకు తగిలింది. అది అతని తలలో దూసుకొనిపోవుట వలన మెదడు కొంచెం బయటకు వచ్చింది. వైద్యులందరూ అతడు బ్రతకడు అని చెప్పారు. అతన్ని వెల్లూరు ఆసుపత్రికి తీసుకొని వెళ్ళమని చెప్పారు. అప్పుడు ప్రతి ఒక్కరూ భయపడినప్పటికీ, మా తల్లి ప్రార్థన చేస్తూనే వుంది. వైద్యులైన మా చిన్నాన్న, మేనత్త సహాయంతో మా తల్లి మా తమ్ముణ్ణి వెల్లూరుకు తీసుకొని వెళ్ళింది. దేవుని కృపనుబట్టి మరియు మా తల్లి చేసిన ఎడతెగని ప్రార్థనలను బట్టి మెదడుకు ఎటువంటి నష్టం కలుగకుండ అద్భుతంగా అతడు బాగుపడినాడు. మా తండ్రి కంట్రాక్టరు కాబట్టి ఆయన ఎల్లప్పుడూ బయట ఊర్లు తిరుగుతూ వుండేవాడు. అందుచేత ఎక్కువ సమయం మా తల్లి మమ్ములను చూసుకోవలసి వచ్చేది. ఇప్పుడు సుధీకర్‌రెడ్డి భార్య భక్తిగల క్రైస్తవురాలు. ఆమె తన భర్త గురించి, కుమార్తె గురించి ప్రార్థిస్తూ వుంది.

ఒకసారి ఐదవ వాడైన నా తమ్ముడు రవీంద్రనాథ్‌రెడ్డికి ఆటస్థలంలో క్రికెట్ బంతి తగిలి ముక్కు ఎముక విరిగి పోయింది. విస్తారంగా రక్తం కారింది. గాయం ఎక్కువ కాకుండా మా తల్లి ప్రార్థనల వలన బాగుపడినాడు. అతని భార్య జయ, మా అమ్మ నిస్వార్థం మరియు విశ్వాసం వలన ఎంతగానో ప్రభావితురాలైంది. ఇప్పుడు ఆమె ఎల్లప్పుడూ ఆమె భర్త గురించి ప్రార్థన చేస్తూనే వుంటుంది. మా తల్లి మాతో లేని కారణంచేత నా వదినలు, మరదళ్ళు అదనపు ప్రార్థనా భారాన్ని కలిగి వున్నారు.

చిన్న వయస్సులోనే నేను విధవరాలినయ్యాను. కాబట్టి నాకు నా తల్లి ప్రార్థనలు ఎక్కువగా అవసరమైనాయి. నా ప్రతి అడుగులో ఆమె నా ప్రార్థనా సహాయకురాలు. నా పిల్లలు ఆమెతో ఎంతో సన్నిహితంగా వున్న కారణం చేత, ఆమె మంచి లక్షణాల వలన వారు ప్రభావితులైనారు. నా కుటుంబం గురించి ఆమె చేసిన ప్రార్థనలన్నీ దేవుడు విన్నాడు, జవాబిచ్చాడు. ప్రస్తుతం మేము ఆనందంగా వున్నాము. మా తల్లి నా అత్తమామలను కూడ ఎంతగానో ప్రభావితం చేసింది. వారందరూ మా తల్లిని ఎంతగానో ప్రేమించారు.

ఈ కారణంచేత మా అత్తమామల కుటుంబం హిందూ మతాన్ని అనుసరిస్తున్నప్పటికీ, మా గ్రామంలో మా తల్లి జ్ఞాపకార్థం ఆలయం వుండటం వారికి ఆనందంగా వుంది. వారందరి గురించి మా తల్లి ప్రార్థన చేస్తుండేది. నా అత్త మా అమ్మను కలసినప్పుడెల్లా తన గురించి ప్రార్థన చేయమని కోరేది. మా తల్లి చేసిన ప్రార్థనల వలన, ఆ తరువాత సంఘకాపరి సజీవ్‌కుమార్ (వై.యస్.జయమ్మ జ్ఞాపకార్థ ఆలయ కాపరి) చేసిన ప్రార్థన వలన మా అత్తకు అనేక అనారోగ్య సమస్యలు వున్నప్పటికీ ప్రశాంతంగా మరణించింది.

పనివారి దగ్గర కొంచెం ఖాళీ సమయం దొరికినప్పుడెల్లా, వారందర్నీ కూర్చోబెట్టి వారికి బైబిలు కథలు వివరించేది, దేవుని వాక్యం బోధించేది. ఫలితంగా మా పని వారందరూ క్రీస్తును నమ్మారు. ఆమె ఎక్కువ సమయం బైబిలు ధ్యానించుటకు, స్త్రీల సహవాసంలో బోధించు నిమిత్తం నోట్సు సిద్ధం చేసుకొనుటకు ఉపయోగించేది. ఆమె చివరి రోజుల్లో బైబిలు నోట్సు దస్తూరి చక్కగా వ్రాయలేకపోతు న్నానని విచారించేది.

మా తల్లి జీవితం ప్రార్థనతో నిండిన జీవితం. ఆమె చివరిగా అపస్మారక స్థితికి వెళ్ళకముందు సహితం మా మేనత్త రాజమ్మతో ఫోనులో చెప్పిన ఈ మాటలు గమనించ దగినవి: “రెడీగా వుండు, జూనియర్ బాలికల కళాశాలలో జరిగే సి.బి.యస్. (కమ్యూనిటీ బైబిల్ స్టడి)కు వెళ్దాం”.

## స్వయానికి ముగింపు - దేవుని ప్రేమకు ప్రారంభం

నీవు మరణించేటప్పుడు నీతో నీ ధనాన్ని తీసుకొని వెళ్ళలేవుగాని దానిని ముందుగా పరలోకానికి పంపగలవు. దేవుని గురించి, ఆయన పని గురించి ఆలోచించినప్పుడు, ఆయన పనికి యివ్వడం మంచి వ్యాపారం. ఇది మంచి పెట్టుబడి. ఎందుకంటే ఈ పెట్టుబడికి సాధ్యమైనంత ఎక్కువ శాతం వడ్డీ వస్తుంది. దీని మీద వచ్చే లాభాలు వందల రెట్లు ఈ జీవితంలో, రానున్న నిత్యలోక జీవితంలో వస్తాయి. అది దేవుని వాగ్దానం. అమ్మ ఈ సత్యాన్ని గ్రహించింది. పర లోకంలోని ఆమె పొదుపు ఖాతా ఎంతో ఎక్కువగా వుంటుందని నా దృఢమైన నమ్మకం. నా తల్లిదండ్రులిద్దరు గొప్ప పరోప కారులు. వారు ఆసుపత్రి, ఆలయాలు మరియు విద్యాసంస్థలు స్థాపించారు. పేదవారికి ఉచిత వైద్యసేవలు చేయుటకు మా రెండవ అన్న వై.యస్.రాజశేఖర్‌రెడ్డికి పులివెందులలో ఒక ఆసుపత్రి కట్టించారు. ఆయన రాజకీయాల్లో ప్రవేశించిన తరువాత, ఆయన వేరే వైద్యులను నియమించి ఉచిత వైద్యసేవలు యిప్పటికీ జరిగిస్తూనే వున్నాడు. అక్కడ వున్న రోగుల మధ్య దేవుని వాక్యం ప్రకటించటానికి వారానికి ఒకసారి మా తల్లి వెళ్ళేది.

ఆమె దగ్గరకు వచ్చే సేవకులందర్నీ దయతో ఆదరించేది. క్రిస్మసు కాలంలో ఆమెకు తెలిసివున్న సంఘకాపరులందరికీ వస్త్రాలు కొనిచ్చేది. భిక్షాటన చేసే ఆడవారికి యివ్వడానికి చీరలు చాల కొనేది. ఒకవేళ వచ్చిన వారికి చీరలు చాలక పోయినట్లయితే తన చీరలు యిచ్చేది.

మానవ సేవ చేయాలని ఆమె తన పిల్లలందర్నీ ప్రోత్సహించింది. ఆమె ప్రార్ధనలు, ప్రోత్సాహమునుబట్టి ఒక అన్న ముఖ్యమంత్రి అయ్యాడు, మరొక అన్న లోక్‌సభ సభ్యుడయ్యాడు, ఒక మనుమడు జగన్ వై.యస్. ట్రస్ట్ తరపున ప్రజలకు ఎంతో సేవ చేస్తున్నాడు.

పూర్తిగా పరిపక్వత చెందినస్థాయి క్రైస్తవులుగా మనం ఎదగాలని యేసుక్రీస్తు కోరుచున్నాడు. ఆత్మీయస్థాయిలో ఎదుగుదల కాలానికి సంబంధించినది కాదు గానీ ఇది యేసుతో, ఆయన వాక్యంతో వుండే సంబంధం మీద, నీ విధేయత మీద మరియు దీనత్వం మీద ఆధారపడి వుంది. ఒక పిల్లవాడు బాధ్యతతో వ్యవహరించడం నేర్చుకున్నప్పుడు, ఇతరుల గురించి ఆలోచించినప్పుడు నిజమైన వ్యక్తిగా మారతాడు. ఇదే విధంగా క్రైస్తవుల్లో కూడ జరుగుతుంది. దేవుని కృపను బట్టి మా తల్లి ఈ ఆత్మీయ పరిపక్వత స్థాయి పొందుకుంది. ఆమె కుమార్తెగా నేను జన్మించినందుకు గర్వపడుతున్నాను.

## అమ్మ శ్రేష్టమైన ధననిధి "పరిశుద్ధ బైబిలు"

దేవుని ప్రియమైన కుమార్తె ధ్యానించిన బైబిలు చూసినట్లయితే, ఆమె దేవుని వాక్యాన్ని ఎంత శ్రద్ధగా ధ్యానించిందో చూచి ఆశ్చర్యపోతాము. ఆమె ప్రభువును ప్రేమించింది. ఆమె దేవుని వాక్యాన్ని ప్రేమించింది. ఆమె లెదర్ అట్టతో వున్న పెద్ద బైబిలు ఉపయోగించింది. ఆమె ఉపయోగించిన బైబిల్లోని ప్రతి పేజీ నలిగిపోయి వుంది. ఆమె వెళ్ళిన ప్రతి స్థలానికి బైబిలు తీసుకొని వెళ్ళేది. మా తల్లి ఉదయం పెందలకడనే లేచి దేవుని వాక్యం ధ్యానించేది. పరిపూర్ణ క్రైస్తవునికి కావలసిన పరిశుద్ధత, దేవుని భద్రత, దేవుని నుండి సమృద్ధి ఆశీర్వాదాలు, దేవుని మీద ఆధారపడుట అను అంశాలను గుర్తించుటలో ఎంతో శ్రద్ధ తీసుకునేది.

## నివాళులు

### శ్రీ ఎస్. ప్రభుదాస్‌రెడ్డి

(గొప్ప ప్రార్ధనాపరుడైన సువార్తికుడు మరియు మా పెద్దనాన్న)

మా పెద్దనాన్న, గొప్ప సువార్తికుడైన శ్రీ ఎస్. ప్రభుదాసుగారి దగ్గరకు వెళ్ళి, మా అమ్మ గురించి ఆయన అభిప్రాయాలు అడిగినప్పుడు ఈ విధంగా వివరించాడు.

జయమ్మ బాల్యం నుండి నాకు తెలుసు. ఆమె తల్లి మాకు బంధువు. ఆమె తల్లి మరియమ్మ భర్త మరణించినప్పుడు తన కుమార్తె జయమ్మను తీసుకొని మా దగ్గర వుండుటకు వచ్చింది. చదువు నిమిత్తం జయమ్మను మద్రాసులోని బెంటింక్ పాఠశాలకు పంపించాము. ఆమె పదవ తరగతి చదివి ముగించిన తరువాత మా చిన్న తమ్ముడు రాజారెడ్డితో ఆమెకు వివాహం చేయాలని మా పెద్దలందరూ నిర్ణయించారు. ఆమె వివాహం చేసుకున్న తరువాత తన పిల్లలను దైవభక్తిలో పెంచే బాధ్యత ఆమె చేపట్టింది. ఆమె యౌవనంలో వున్నప్పుడు, ఆమె ఆత్మీయ అనుభవం తెలుసుకోవాలని అనుకున్నాను. ఆ సంధర్భంలో క్రీస్తునందు విశ్వాసముంచావా? ఆయన రక్షణ పొందుకున్నావా? అని ఆమెను ప్రశ్నించాను. వెంటనే ఆమె దృఢనిశ్చయంతో తనకు దేవుడు యిచ్చిన రక్షణ పొందుకున్నానని గట్టిగా చెప్పింది. ఆ విషయం విని నేను ఎంతో సంతోషించాను. ఆమె తన భర్త రక్షణ గురించి ప్రార్థిస్తూనే వుండేది. (సశేషం)

# మదర్ తెరీసా

లేఖనాల్ని గుర్తు చేసుకొని ప్రభువు చెప్పిన మాటలు జ్ఞాపకము చేసుకొనుట వలన దేవుని నడిపింపు, ఆయన చిత్తము మనకు తెలుపబడుతుంది. అపొ.కార్య. 11:16లో పేతురుకు యేసుప్రభువు చెప్పిన మాట జ్ఞాపకము చేసుకొనెనని వ్రాయబడినది. మదర్ తెరీసా వద్ద చేరిన అమ్మాయిలు ఇద్దరిద్దరుగా వెళ్ళి పేదవారి సేవలో పని చేస్తుండేవారు. ఈ విధంగా ఇద్దరిద్దరుగా వెళ్ళుట వలన ఒకరికొకరు సహాయము గాను, భద్రతగాను ఉంటుందని ఒక తెలివైన పెద్దాయన గమనించి చెప్పినప్పుడు మదర్ తెరీసా ఖచ్చితంగా ఏమని జవాబు చెప్పారంటే, ఇద్దరేసి వెళ్ళుటలో వారి భద్రతకు సంబంధించినదేమీ కాదుగాని, ప్రభువైన యేసు లూకా 10వ అధ్యాయంలో తాను వెళ్ళబోవు ప్రతి ఊరికిని ప్రతి చోటికిని తనకంటె ముందు ఇద్దరిద్దరినిగా పంపినట్లు తెలియజేసింది. అంటే ప్రభువు చెప్పిన ఆజ్ఞను అమలుపరచుట ద్వారా వాళ్ళ నియమావళిలో ఒక భాగమైంది. యేసుప్రభువు శిష్యులులాగా యిద్దరిద్దరు కలసి హాస్పిటల్‌కి, కుష్టురోగుల దగ్గరికి వెళ్ళాలి.

1949లో భారతదేశము మామూలు స్థితికి చేరింది. అయినను నిర్భాగ్యులైన పేదరికము, వ్యాధిబాధలు మాత్రము ప్రబలంగానే వున్నాయి. క్రొత్తగా స్వాతంత్ర్యం పొందిన భారత దేశానికి తనవంతు ధైర్యాన్ని సమకూర్చాలని మదర్ తెరీసా భావించింది. గాంధీగారికి అతి ప్రియుడైన జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానమంత్రిగా భారతదేశాన్ని ముందుకు తీసుకెళు తున్నారు. ఆమెకు భారతదేశ పౌరసత్వం ఇవ్వబడింది. ఒకరోజు మైఖేల్ గోమ్స్‌గారితో ట్రామ్‌లో హౌరాకు ప్రయాణం చేస్తుండగా కొందరు ఆమె గురించి బెంగాలిలో ఈ విధంగా అంటున్నారు. ఈ ఐరోపా తెల్ల మహిళ కలకత్తాకు వచ్చి ఎందరో భారతీయ హిందువుల్ని క్రైస్తవ మతంలోకి మారుస్తుంది. ఈ విదేశీయు రాలు ఆ పనంతా డబ్బుకోసం చేయటంలేదని మరింత మందిని క్రైస్తవమతంలోకి మార్చేందుకు చేస్తున్నారని అంటు న్నారు. వాళ్ళనుకునే మాటలన్నీ ఆవిడకు అర్ధమవుతూనే వున్నాయని ఆమెకు తెలియదు. మదర్ తెరీసా సెయింట్ మేరీస్‌లో బెంగాలీలోనే బోధించింది. చాలాసేపు ఆమె ఏమీ మాట్లాడకుండా వాళ్ళు అంటున్నదంతా విన్నది. ఆఖరుకు వాళ్ళ వైపు తిరిగి "అమె భారతార్‌రీ భారత్ అమర్" అంది. నేనూ భారతీయురాల్ని, భారతదేశం నాది అని దానర్ధం. వాళ్ళ నోట మాట రాలేదు. మైఖేల్ గోమ్స్ అది విని ఎంతో సంతోషించాడు.

మదర్ తెరీసా తన కార్యకలాపాల్ని ప్రారంభించిన కొన్ని నెలల్లోనే, 1950 సంవత్సరం మొదట్లో ఆర్చ బిషప్ పెరియార్ తుది నిర్ణయం తీసుకున్నారు. ఆవిడ అడుగు వేసిన దారికి అనుకూలంగా వుందా నిర్ణయం. ఆయన ఏప్రిల్ నెలలో రోమ్ నగరం వెళుతున్నారు. ఆ లోపు మదర్ తెరీసా స్థాపించబోయే సంస్థ నియమావళి అయిదు కాపీలు తీసుకుని కార్డినల్ పెట్రస్ ఫమాస్ని బియొండికి యివ్వాలని ఆయన సంకల్పం. ఆ కార్డినల్ ఆఫీస్ ఫర్ ది ప్రొపగేషన్ ఆఫ్ ఫెయిత్ సంస్థకు అధిపతి. తుది గుర్తింపు ఇవ్వవలసింది ఆయనే. ఆర్చ్ బిషప్ ఆదేశానుసారం ఫాదర్ నాన్ ఎగ్జిమ్, మదర్ తెరీసా నియమా వళి తయారు చెయ్యడం మొదలు పెట్టారు. 275 నియమా లతో "కాన్స్టిట్యూషన్ ఆఫ్ ది మిషనరీస్ ఆఫ్ ఛారిటీ" తయారు చేశారు. అందులో ముఖ్యమైంది. డార్జిలింగ్ ప్రయాణంలో మదర్ తెరీసాకు యేసుప్రభువు పిలిచిన పిలుపు. తను కాన్వెంట్ వదలిపెట్టాలి. పేదవాళ్ళలాగా బతకాలి, తన కార్యకలాపాలు వుండవలసింది మురికివాడల్లో. కలకత్తా వీధుల్లో దిక్కులేక వదిలేసిన పసిగుడ్డులు, పిల్లలు, కుష్టువ్యాధిగ్రస్తులూ, మరణ సన్నిధిలో వున్న అభాగ్యులువంటి వాళ్ళకోసమే. "పవిత్రత, పేదరికం, విధేయత" ఈ మూడింటినీ మనస్ఫూర్తిగా అంగీ కరిస్తూ నాలుగో ప్రమాణాన్ని మదర్ తెరీసా తీసుకున్నారు. "నిరుపేదలకు మనస్ఫూర్తిగా స్వచ్ఛంద సేవ" చెయ్యడం. దీనివల్ల మృత్యుముఖంలో వున్న వాళ్ళకి, నిరాదరణకు గురైన వారికి, సంఘ బహిష్కృతులకు, కుష్ఠువ్యాధిగ్రస్తులకు జీవితంలో సకల విశ్వాసాన్ని, ఆశని పోగొట్టుకున్న వాళ్ళకి భౌతికంగా, ఆధ్యాత్మికంగా ఆహారం, వస్త్రం, రక్షణ, సేవ కల్పించే కర్తవ్యం మిషనరీస్ మీద వుంటుంది.

1950 అక్టోబర్ 7న మదర్ తెరీసా స్థాపించిన క్రొత్త సమాజానికి పోపుగారి ఆమోదం లభించింది. గోమ్స్‌గారి భవనంలో ఆర్చ్ బిషప్ పెరియార్‌గారు స్వయంగా వచ్చి ఫాదర్ వాన్‌ఎగ్జెమ్, ఫాదర్ హెన్రీలతో కలసి దివ్యపూజ ప్రార్ధన జరిపించారు. ఆ ప్రార్ధనలో ఆ స్థాపనా శాసనాన్ని ఫాదర్

వాన్‌ఎగ్జెమ్ చదివి వినిపించారు. "మదర్ తెరీసా పర్యవేక్షణలో ఈ సమాజం ఏర్పడుతుంది. దయార్ద్ర హృదయంలో నిర్భాగ్యులను ఆదరించాలన్న దీక్ష హర్షనీయం. అనాధలైన పిల్లల్ని, పెద్దల్ని ముసలివారిని, నిరాధారులైన పేదలకు, రోగులకు, మరణించే వారికి నిరుపయోగులకి త్రోసివేయబడిన వారికి సేవ చెయ్యాలన్న సత్సంకల్పం అభినందనీయం. కష్టనష్టాలను భరిస్తూ, శక్తి వంచన లేకుండా, వాడవాడలా తిరిగి గ్రామాలకు వెళ్ళి, ఎంతో ఓర్పుగా అవసరంలో వున్న వారికి అందించే సేవలను పరిశీలించిన పిదప, యేసుక్రీస్తు ప్రేమను లోకానికి వెల్లడించాలన్న ఏకైక లక్ష్యంతో మదర్ తెరీసా స్థాపించిన సమాజం చేస్తున్న అవిరళ కృషికి సంపూర్తిగా తెలుసుకున్న తర్వాత, ఈ సంఘానికి అధికార పూర్వకమైన గుర్తింపు నివ్వడం జరిగింది. ఇక నుంచి ఈ సమాజం మిషనరీస్ ఆఫ్ ఛారిటీ అనే పేరున ఉదహరిస్తుంది. ఈ పత్రానికి ఆర్చ్ బిషప్‌గారు ఆమోద ముద్రవేసి మదర్ తెరీసాకు అందించారు. పదకొండుమంది సిస్టర్స్‌తో మదర్ క్రొత్త సమాజాన్ని స్థాపించింది.

ఆ తర్వాత రెండేళ్ళలో మదర్ తెరీసా మిషనరీస్ ఆఫ్ ఛారిటీ సంస్థలో ముప్పై మంది చేరారు. పై అంతస్తు మొత్తం నిండిపోయింది. అది చాలక మదర్ తెరీసా పైన మిద్దె మీద తాత్కాలిక ఏర్పాటుగా ఒక గది వేశారు. ఇంకా స్థలం సరి పోవడం లేదు. రెక్కలు విప్పుకుంటూ వున్న మదర్ తెరీసా మిషనరీస్ ఆఫ్ ఛారిటీ సంస్థపట్ల ఫాదర్ హెన్రీ, ఫాదర్ వాన్ ఎగ్జెమ్ ఎప్పుడూ ఆసక్తి చూపిస్తూనే ఉన్నారు. వాళ్ళు మళ్ళీ సైకిళ్లు వేసుకొని పెద్ద నివాసము కొరకు వెతకడం ప్రారంభించారు. సిస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చెయ్యడం మొదలు పెట్టారు. ఒకరోజున ఒకాయన క్రీక్‌లేన్‌కి వచ్చి అనుకూల మైన భవనం ఒకటి అమ్మకానికి వుందని మదర్ తెరీసాతో చెప్పాడు. అది 54ఎ, లోయర్ సర్క్యులర్ రోడ్‌లో వుంది. మదర్ తెరీసాను వెళ్ళి చూడమన్నాడు. ఆ ఇంటి యజమాని పేరు డాక్టర్ ఇస్లామ్. ఆయనో మేజిస్ట్రేట్. మదర్ తెరీసా వెళ్ళి చూశారు. అంతా బాగానే వుంది కాని మదర్ దగ్గర చిల్లి గవ్వలేదు. ఆ భవనాన్ని కొనాలంటే సాధ్యమయ్యే విషయమేనా? పైగా అది కలకత్తా నగరం మధ్యభాగంలో బాగా రద్దీగా వుండే ప్రాముఖ్యమైన స్థలంలో వుంది. ఆమె ఆలోచనలో పడింది. అది దైవ సంకల్పమైతే ఆయనే డబ్బు విషయం చూసుకుంటాడనే సరిపెట్టుకుంది. డాక్టర్ ఇస్లాం సెయింట్ జేవియర్ కాలేజీలో చదువుకున్నాడు. విద్యారంగంలో మిషనరీలు, ఫాదర్లు చేస్తున్న సేవ అతనికి బాగా తెలుసు. ఆ భవనం అన్నిటికీ అందుబాటులో వుంది. చక్కగా సరిపోతుంది. అందుచేత దాన్ని కొనడం గురించి ఎగ్జెమ్ ఆర్చ్ బిషప్స్‌తో మాట్లాడారు. అటువంటి భవనం పోతే మరలా దొరకటం కష్టమని దాని ఆవశ్యకతను ఆర్చ్ బిషప్‌గారు ఆ భవనాన్ని కొనడానికి లక్ష రూపాయలు వడ్డీ లేని అప్పుగా మంజూరు చేశారు. డాక్టర్ ఇస్లాం పాకిస్తాన్‌కు వలస వెళ్ళి పోతున్నా, తన భవనాన్ని అమ్మి విడిచి వెళ్ళడం ఎలా? అని ఆలోచిస్తు న్నాడు. మదర్ తెరీసా చేస్తున్న సేవ గురించి తన మిత్రులనడిగి తెలుసుకున్నాడు. కాని వారు బేరం కుదిరినా లక్షరూపాయ లకు ఆ భవనం వున్న స్థలం ఖరీదులో సగం కూడా కాదు. ఇస్లాం ఆ భవనం ముందు నిలబడి దానికేసి చూస్తూ చలించిపోయినట్లు కనబడ్డాడు. కొంచెంసేపు ఆగాక తన దగ్గర్లో మౌలాలి మసీదుకు వెళ్ళి ప్రార్థన చేసి వచ్చాడు. ఆయన కళ్ళలో నీళ్ళు తిరిగాయి. "దేవుడే నాకీ ఇల్లు ఇచ్చాడు. తిరిగి ఆయనకే ధారపోస్తున్నాను" అన్నాడు. లక్ష రూపాయలకు ఆ పెద్ద భవనాన్ని మదర్ తెరీసాకు అమ్మివేసి డాక్టరు ఇస్లాం వెళ్ళిపోయారు. కొంతకాలం గడిచాక మదర్ తెరీసా లక్ష రూపాయల అప్పును తీర్చివేసినారు.

1953 ఫిబ్రవరిలో మిషనరీస్ ఆఫ్ ఛారిటీ సిస్టర్స్ 27 మందితో లోయర్స్ సర్క్యులర్ రోడ్‌కు మారింది. ఇప్పుడు ఆ రోడ్డు పేరును జగదీస్ చంద్రబోస్ రోడ్డుగా మార్చారు. అది మిషనరీస్ ఆఫ్ ఛారిటీస్ కేంద్ర స్థానమైంది. దానికి మదర్ హౌస్ అని పేరు పెట్టారు. నలభై యేళ్ళలో అది యావత్ క్రైస్తవ కూటమిలో మహా వైభవోపేతంగా వెలిగిపోయే మతశాఖ ఆయువుపట్టు అవుతుందని వాళ్ళు ఆనాడు ఏ మాత్రం ఊహించి వుండరు. ఇవాల్టి కార్పోరేట్ భాషలో చెప్పుకోవాలంటే ఖండఖండాంతరాల సభ్యులతో అదొక అంతర్జాతీయ సంస్థగా ఎదిగి వుండేదని ఊహించి వుండరు. ప్రపంచంలోనే పరమ నిరుపేదలకు తగ్గ విశాల ప్రాంతంగా ఎదుగుతుందని వాళ్ళు ఆనాడు ఊహించి వుండరు. మందలు మందలుగా ఎగ్జిక్యూటీవ్ అధికారులు లేరు, కంప్యూటర్ల సముదాయము లేదు. టెలెక్స్, ఫ్యాక్స్ యంత్రాలు లేవు ఒక్క టెలీఫోన్ తప్ప. ఖర్చులు పెరుగుతాయని మదర్ తెరీసా ఫోన్ పెట్టించుకో దానికి కూడా ఇష్టపడలేదు. కాని సమయం వృధా కాకుండా వుంటుందని అంగీకరించారు. పైనుదహరించినవేమీ లేకుండానే మదర్ తెరీసా భారతదేశంలోని ప్రతి నగరంలో, పట్టణంలో, అనేక దేశాల్లో పునాదులు వేసుకున్నారు.

# విశ్వాసంలో ఓ మెట్టు



టెలిగ్రాం తీసుకొని ఒంగోలు జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసరుగారిని ఆయన ఆఫీసులో కలిశాడు. ఆఫీసుకు వెళ్ళి గుమస్తా దగ్గర రశీదు రాయించుకొనిరా హైదరాబాదుకు ఖర్చులకు అడ్వాన్సు ఇస్తాను అన్నాడు. "ఒక పేపరు ఇవ్వండి నేనే రాసి ఇస్తాను" అన్నాడు సామ్యేలు. ఆ కాగితం తీసుకొని ప్రక్కనున్న కిటికీ దగ్గర నిలబడి ఇంగ్లీషులో రిసిప్టు రాసిచ్చాడు. తన కళ్ళ ఎదురుగా ఊహించలేనంత వేగంగా ఇంగ్లీషులో రశీదు వ్రాసిచ్చిన డ్రైవరుని చూసి ఆశ్చర్య పోయాడు ఆఫీసర్. "ఏమి చదువుకున్నావు?" అని అడిగాడు. జవాబు విని "గుమస్తా పనికి అప్లై చెయ్యలేదా?" అన్నాడు జాలిగా.

"సార్, ఇదే ప్రశ్న ఇప్పటికి ముగ్గురు ఆఫీసర్లు అడిగారు. కాని ఒక్కరు కూడా సహాయం చెయ్యలేదు" అని చెప్పాడు సామ్యేలు. ఆయన ఇచ్చిన డబ్బులు తీసుకొని హైదరాబాద్ వెళ్ళి క్రొత్త మెటాడార్ వ్యాన్ తీసుకొని ఒంగోలు బయలుదేరాడు. పాతబస్తీలో చంచల్‌గుడ దగ్గర గొడవలు జరుగుతున్నాయని తెలిసి ప్రక్కనే వున్న పోలీస్ స్టేషన్‌కు వెళ్ళాడు. "మీరు సైరన్ వేసుకుంటూ స్పీడ్‌గా వెళ్ళండి, మీకు అందరూ దారి ఇస్తారు" అని చెప్పాడు ఇన్స్‌పెక్టర్. వెంటనే సైరన్ వేసి బయలుదేరాడు. అంబులెన్స్ సైరన్ విన్నవారందరూ ప్రక్కకు తొలగి దారి ఇచ్చారు.

ఊరు దాటిన తర్వాత ఒక పదిమంది బండి ఆపమని చేతులు పైకెత్తారు కాని బండి ఆపకుండానే వెళ్ళాడు సామ్యేలు. ఒకచోట ఒకాయన ఒంటరిగా నిలబడి చెయ్యి ఎత్తాడు. ఎందుకో బండి ఆపాలనిపించి బండి ఆపాడు సామ్యేలు. ఆ వ్యక్తి ముందు సీట్లో కూర్చున్నాడు. "బండి ఖాళీగా తీసుకొని పోతున్నారే" అని అడిగాడు ఆయన. "నేనొక్కడినే వచ్చాను" అని చెప్పాడు సామ్యేలు. "అదికాదండీ, ఎవర్నీ ఎక్కించుకోలేదే?" అన్నాడు. "నాకు భయం, ఎవరన్నా పట్టుకుంటే?" అన్నాడు సామ్యేలు. ఆయన నవ్వాడు. "నేనూ గవర్నమెంటు ఎంప్లాయినే. అంత భయపడతారెందుకు? అంబులెన్సును ఎవరండీ పట్టుకొనేది? మరి నన్ను ఎక్కించుకున్నారు కదా!" అన్నాడు. "మీరు డీసెంటుగా వున్నారు. అదీకాక ఒంటరిగా వున్నారు" అని అన్నాడు సామ్యేలు.

"మీరు అమాయకులులాగ ఉన్నారే. అంత భయపడితే బ్రతకలేమండీ. నేను వెనుక కూర్చుంటాను, మీరు జనాన్ని ఎక్కించుకోండి. నేను చూసుకుంటాను" అని వెనక్కు వెళ్ళాడు. చెయ్యెత్తిన వారి దగ్గర ఆపితే ఆయన వాళ్ళతో మాట్లాడి కండక్టరు పని ప్రారంభించాడు. సాయంత్రం ఏడు గంటలకి నాగార్జునసాగర్ చేరుకున్నారు.

నేరుగా ఒంగోలు వెళ్తారా? లేక రాత్రికి ఇక్కడ వుంటారా? అంటూ కొన్ని రూపాయలు, కొంత చిల్లర సామ్యేలుకి ఇవ్వబోయాడు. "ఎంత?" అన్నాడు సామ్యేలు. "నేను లెక్కపెట్టలేదు" అన్నాడు ఆయన. "లెక్కేయండి" అన్నాడు సామ్యేలు. "ఈ రాత్రి సంగతి చెప్పరే" అన్నాడు ఆయన. "గవర్నమెంటు ఆసుపత్రికి వెళ్ళి అక్కడ వుండి తెల్లవారి ప్రయాణం" అన్నాడు సామ్యేలు.

"మా యింటికి వెళ్దాం పదండి" అంటూ దారి చూపించసాగాడు. ఒక పెద్ద ఎత్తైన భవనం చూపించి "ఇది క్లబ్ బిల్డింగ్, ఎక్కడ నుండి చూసినా కనిపిస్తుంది"అన్నాడు. నేరుగా వారి క్వార్టరుకు తీసుకొని వెళ్ళాడు. ఆయనకు భార్య, పన్నెండు సంవత్సరాలలోపు ఇద్దరు పిల్లలు అరుణ, మురళి. సామ్యేలు బయటికి వస్తుంటే "ఇంటినెంబరు 154బి, గుర్తుపెట్టుకోండి" అని పెద్దగా చెప్పాడు ఆయన.

ఇంత పెద్ద అంబులెన్స్ ఇంటిముందు వుంటే ఇల్లు ఎలా గుర్తుపట్టలేము అనిబజారు వెళ్ళి తన పని ముగించుకొని ఇంటికి వెనుదిరిగాడు. తను వచ్చిన దారి జాగ్రత్తగా గుర్తు పెట్టుకున్నాడు. అయినా ఏ వీధి ముందు వున్నా కూడా అంబులెన్సు కనబడుతుందిలే అనుకున్నాడు. రాత్రి ఎనిమిది అయింది. ఇల్లు వదిలి అరగంట అయింది. గబగబ నడక ప్రారంభించాడు. అన్నీ రేకు ఇల్లు వున్న క్వార్టర్లే. ప్రతి వీధిలోను చిల్లచెట్ల గుంపులు.

ఒక రోడ్డు మీద నలుగురు నిలబడి ఉన్నారు. "సార్, రఘురాంగారు, యు.డి.సి. ఇల్లు ఎక్కడ?" అని అడిగాడు సామ్యేలు. "ఇక్కడ వేలమంది ఉద్యోగస్తులు వుంటారు,

చాలామంది రఘురాంలు వుంటారు క్వార్టరు నంబరు చెప్పండి" అన్నారు. నంబరు గుర్తులేదు. ఇవే మాటలు ఇంకా పది చోట్ల ఇవే మాట్లాడారు. తొమ్మిది గంటలయ్యింది. ఎటు వెళ్ళినా ఎత్తైన క్లబ్ కనబడుతుంది. ఇంకా నయం వెన్నెల రోజులు. కాళ్ళు నొప్పులు పుడుతున్నాయి. ఒక్కోచోట కొండ ఎక్కినంత ఎత్తు. ఒక్కోచోట లోయలో దిగినట్లు. ఎటువెళ్ళినా క్వార్టర్స్, చిల్లచెట్లు. అంబులెన్సు వున్న ఇల్లు మాత్రం కనబడలేదు. తీసుకున్న తీర్థం పని అయిపోయింది. మరలా వెనక్కు బజారు వైపు వెళ్ళాడు. మళ్ళీ కొంచెం హుషారు వచ్చింది. సమయం చాలా స్పీడుగా నడుస్తుంది. ఎవర్ని అడిగినా క్వార్టరు నంబరు చెప్పమంటున్నారు.

ఒక ఇంటి ముందు ఇస్త్రీ బల్ల వుంది. అక్కడికి వెళ్ళి రఘురాంగారిల్లు ఎక్కడ అడిగాడు. ఈసారి ఇంకొకమాట కలిపాడు. వారి పిల్లల పేరు అరుణ, మురళి అని చెప్పాడు. తెలియదు అని చెప్పారు. ఇంతలో లోపల నుండి పది సంవత్సరాల పిల్లాడు వచ్చి మురళి వాళ్ళిల్లు తెలుసు అన్నాడు. ఐస్ వాటర్ ముఖం మీద చల్లినట్లుగా అనిపించింది సామ్యేలుకు. బాబు వాళ్ళ అక్క పేరు అరుణ కదా అన్నాడు. ఆ అబ్బాయి నేను చూపిస్తాను అని ప్రక్క వీధిలోకి తీసుకెళ్ళాడు. అక్కడ అంబులెన్సు కనిపించింది.

ఆ రాత్రి స్నానంచేశాక, చపాతి, ఆమ్లెట్ పెడితే తిన్నాడు. అరుణ, మురళి అంబులెన్సులో కూర్చుంటాము అన్నారు. సామ్యేలు రఘురాంతో సినిమాకి వెళ్దామా? అన్నాడు. పది నిమిషాల్లో అందరూ సినిమా హాల్లో ఉన్నారు. ఆ రాత్రి హాయిగా నిద్రపోయాడు సామ్యేలు.

ఉదయాన్నే "సార్, మీకు మార్కాపురం వైపు ఏమి పనిలేదా?" అని అడిగాడు సామ్యేలు. "నేను అదే అనుకుంటున్నాను" అన్నాడు. టిఫిన్ చేసి బయలుదేరారు ఇద్దరూ. రాత్రి రఘురాంగారి అంబులెన్సు కష్టార్జితం 270 రూపాయలు. మరలా మార్కాపురం చేరేటప్పటికి దాదాపు 300 సంపాదించి అంబులెన్సు కష్టార్జితం సామ్యేలు చేతిలో పెట్టాడు రఘురాం. ఈ సొమ్ము దేవుడిచ్చాడు అనుకోవడానికి సామ్యేలు మనసు ఒప్పుకోలేదు. చట్టానికి వ్యతిరేకంగా దేవుడు ఏ సహాయం చెయ్యడని సామ్యేలు నమ్మకం.

క్రొత్త అంబులెన్సు కనిగిరి చేరిన తర్వాత కనిగిరిలో సామ్యేలుకు ఒక ప్రత్యేకత ఏర్పడింది. ముఖ్యంగా మీడియా వారికి. చిన్న పట్టణాలలో పనిచేసే గవర్నమెంటు ఉద్యోగులను వేధించుకు తినేవారు పత్రికల వాళ్ళు. ఏదో వంక పెట్టుకొని అంబులెన్సును అడిగేవారు. రోగులను తీసుకొని మద్రాసు, గుంటూరు అనేకసార్లు వెళ్ళవలసి వచ్చేది. సామ్యేలు ఎక్కడికి వెళ్ళినా హాస్పిటల్లో డ్యూటీ డాక్టరుకు తెలియపరచవలసి వచ్చేది. ఎంత రాత్రిపూటైనా వచ్చి నిద్ర లేపేవారు.

జయరావుగారి సారధ్యంలో హైదరాబాద్ నుండి ఆడిట్ వారు అయిదుగురు కనిగిరి హాస్పిటల్‌కు వచ్చారు. వారికి హాస్పిటల్లో ప్రత్యేకమైన వసతులు కల్పించారు. ఆడిట్ వారంటే ఎంత పెద్ద గవర్నమెంటు ఉద్యోగి అయినా అసహనంగా వుంటారు. ఆడిట్ వారు వెళ్ళిపోయేదాకా ఊపిరి పీల్చుకోరు. వారిని మధ్యాహ్న భోజనానికి హోటల్‌కి తీసుకెళ్ళటానికి అంబులెన్స్ సిద్ధం చెయ్యమన్నారు. వారు వచ్చి అంబులెన్సులో కూర్చుని చాలా సంతోషించారు. అంబులెన్సు తలుపు తీయగానే మంచి గంధం వాసన వచ్చింది. లోపల పరిశుభ్రంగా వుంది. జయరావుగారు "నీ పేరేమిటి?" అని అడిగాడు. "సామ్యేలు" అన్నాడు. "ఎంతకాలం నుండి పనిచేస్తున్నావు?" అని అడిగాడు. "ఏడు సంవత్సరాల నుండి, కాని ఈ బండి వచ్చి ఎనిమిది నెలలే అయింది" అన్నాడు సామ్యేలు. "ఎనిమిది నెలలా?" అన్నాడు. "అయినా ఇంత బాగా వుంచావే" అంటూ మెచ్చుకున్నాడు. భోజనమైన తర్వాత హాస్పిటల్లోని ఆఫీసులోకి వెళ్ళాడు.

రాత్రి భోజనానికి మరలా తీసుకొని వెళ్ళాడు. మరలా హాస్పిటల్లో వారిని వదిలిన తర్వాత జయరావుగారు సామ్యేలును పిలిచి "మీ ఇల్లు ఎక్కడ?" అని అడిగాడు. "ఈ రోడ్డు చివర్లో పావు కిలో మీటరు వుంటుంది" అన్నాడు సామ్యేలు. "ఉదయం ఎనిమిది గంటలకు నేను మీ యింటికి రావచ్చా?" అని అడిగాడు జయరావు. సామ్యేలు ఆశ్చర్యపోయాడు. "ఖచ్చితంగా రండిసార్, టిఫిన్ మా యింట్లోనే చెయ్యండిసార్" అన్నాడు. "మేమందరం కాదు, నేనొక్కడినే వస్తాను టిఫిన్‌కి" అన్నాడు.

ఉదయం ఏడున్నరకి హాస్పిటల్‌కి వెళ్ళేసరికి జయరావుగారు సిద్ధపడి వున్నాడు. ఇద్దరూ కలసి మాట్లాడుకుంటూ వస్తుంటే, డాక్టర్లు, నర్సులు, స్టాఫంతా వింతగా చూస్తున్నారు.

(...మిగతా 18వ పేజీలో)

(3వ పేజీ తరువాయి....) **చిన్నచూపు**

యుంటుంది దానిని మార్చాలని ఎవరు అనుకోరు ఆ విషయములో అందరికి ఒకే నిర్ణయం.

గాని ప్రభువుకు స్తోత్రము. ఆనాటి ఆది సంఘంలో గ్రీకు భాష మాట్లాడు యూదులు హెల్లేనీయులు తమ తల్లి, అక్క, చెల్లి, పిన్ని, వదిన మీద తిరస్కారముతో, పక్షపాతంతో కూడిన చిన్నచూపును ఓర్చలేక సణిగి తమ అసమ్మతిని ప్రకటించిరి. ప్రభువుకు స్తోత్రము. పేతురు 12 మంది అపొస్తులులు, శిష్యుల సమూహమును తమ యొద్దకు పిలిచి సమస్యను సున్నితంగా పరిష్కరించారు. అది చాలా గొప్ప విషయము. ఆత్మఫలములలో ప్రేమ ముఖ్యమైనది గదా.

ఆ తర్వాత ఆ పిచ్చి తల్లులు సంతోషించినా తామనుభవించిన ఆనాటి క్షోభ, అవమానం, సిగ్గు మాత్రం ఆజన్మాంతం మరిచివుండరు.

ఈనాటి విధవ తల్లుల బాధ, అవమానము, క్షోభ, ఆకలిదప్పులు తీరేదెప్పుడో. అసలు ఆ అవకాశమంటూ వుందా? ఏమో? వారికి ప్రభువే దిక్కు. ఆది సంఘము ప్రయోగత్మకంగా ప్రభువును చూపింది. కాని అది చాలా స్వల్ప విషయముగా నేటి నవనాగరిక సభ్యసంఘములు ప్రయోగాత్మకంగా ప్రేమను చూపిస్తున్నాయా? కుటుంబాలలో విధవలు, వృద్ధులు ఎలా చూడబడుతున్నారో వారికి తెలుసా? తెలుసుకొనే సమయం వారికున్నదా?

చాలాకాలం క్రితం క్లౌపేట, 1వలైనులో వున్న ఒక బావిలో ఒక వృద్ధురాలి శవం కన్పించింది. ఆ చుట్టుప్రక్కల వారు ఆ వృద్ధురాలిని గుర్తుపట్టారు. సినిమాహాలు వైపు వుండేదని, రెండురోజుల క్రితం దోక్కుంటూ వచ్చి బావిలో పడటానికి ప్రయత్నించిందని, వారు చూచి వారించి పంపించేశారని చెప్పుకున్నారు. మరలా మూడు రోజులకు ఏ అర్ధరాత్రో అపరాత్రో వచ్చి పడిందో తెలియదు. ఆమె నడవలేదు. బావి పిట్టగోడకు అరుగులాగా మనిషి దూరేంత మేర రంధ్రము వుంది. దానిలో గుండా ఆమె దూరి పడిందన్న మాట. ఎంత ఘోరం. ఆ తల్లి ఎంతగా విరక్తి చెందిందో గదా!

ఇంకా మనము వార్తలు చదువుతుంటే మనిషి ప్రాణాలు ఎంత చులకనైపోయాయో తెలుస్తుంది. బస్సులో ఒంటరిగా వచ్చి ఒకచోట దిగి సాయంత్రానికి శవంగా మారిన వృద్ధుడు గుర్తు తెలియని వృద్ధుల శవాలు చెట్ల కంపల్లో, రైల్వేస్టేషన్లో ఇలా వారి ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసి పోతున్నాయి. భర్తలేని స్త్రీ విధవరాలు. మరి భార్య చనిపోయిన పురుషుని ఇంగ్లీషులో విడోయర్ అంటారు. మరి తెలుగులో ఏమంటారో తెలియదు. వారి గతీ అంతే.

దొంగల చేతిలో చిక్కి కొట్టబడి దిగంబరంగా బాట ప్రక్కన పడివున్న మనుష్యుని దేవాలయములో పరిచర్య చేసే లేవీయుడుగాని, యాజకుడుగాని పరామర్శించారా? వారికి సమయం ఏది? ఓపిక ఏది? వారు దేవాలయములో సేవచేయటానికి త్వరగా వెళ్ళాలి. ఏ బాదరా బందీలేని సమరయుడు వచ్చాడు. దగ్గరకు వెళ్ళి మోకరించి అతనిని చూచి, జాలిపడి తగిన విధంగా సహాయం చేశాడు. దేవునికి స్తోత్రము. ఈ రోజుల్లో సమరయులూ లేరు. విశ్వాసులారా, దైవజనులారా మేలుకోండి. విధవరాండ్రను గురించి, వృద్ధులను గురించి ప్రార్థించండి. వారిని దర్శించి ఒక చిన్న ప్రార్థన చెయ్యండి. దేవుని దయకు పాత్రులు కండి. నా చిన్నతనంలో వృద్ధులున్న యింటిని మిషనరీలు దర్శించి ప్రార్థించి ఆదరించేవారు. మనలో చాలామందికి ఆ విషయం తెలుసు. గనుక కనీసము వారి కొరకు ప్రార్థించండి. చిన్నచూపు మాని పెద్దచూపు అలవరచుకుందామా? ప్రభువు సహాయం చేయునుగాక! ఆమేన్. **– పులుకూరి సుగుణమ్మ**

---

(17వ పేజీ తరువాయి....)

డ్రైవర్‌కి ఆడిట్ ఆఫీసర్‌కి స్నేహమేంటి? అని. ఇంటికి వచ్చిన తర్వాత కూర్చుంటూ "మీరు విశ్వాసి కదా!" అన్నాడు జయరావు. సామ్యేలుకు అర్థం అయింది. ఆయన బ్రదరన్ గ్రూపు విశ్వాసి అని. "ఇప్పుడు కాదండి" అన్నాడు సామ్యేలు. "ఒకప్పుడైనా, ఎప్పుడైనా ఆయన బిడ్డలను ఆయన వదలడు. నీ మాట తీరులో, పద్ధతిలో నువ్వు యేసును ఎరిగిన వాడవని గ్రహించాను" అన్నాడు జయరావుగారు. అలా చాలా చాలా విషయాలు గంటన్నరసేపు మాట్లాడుకున్నారు. ఇంటి నుండి మరలా హాస్పిటల్లోకి వస్తుంటే ఆడిట్ స్టాఫ్ కూడా ఆశ్చర్యపోతూ చూస్తున్నారు జయరావుగారు సామ్యేలుతో అంత సన్నిహితంగా ఉన్నారని.

సాక్ష్యము

# వింజమూరి వసంత కుమారి

మా తండ్రి రావుపల్లి వెంకట నరశింహంగారు తల్లి రత్నమ్మగారు. మా అక్క, నేను, చెల్లి జయ, ఒక అన్నయ్య. నలుగురు సంతానము. పట్నాయక్ కులానికి చెంది, బహు నిష్ట కలిగి హిందూ ఆచార వ్యవహారాలు జరిపించేవారు. కాళికామాతను నిత్యం పూజించేవారు. స్వగ్రామము జైపురము. ఫారెస్టు మేనేజరుగా ఉద్యోగం చేస్తూ అరకులోని సుంకరమెట్టు వచ్చి మా తల్లిని చూసి వివాహము చేసుకోవాలనుకున్నారు. మా తల్లి యేసును ప్రార్థించే కుటుంబము. అందువలన మా అమ్మ తల్లిదండ్రులు వివాహమునకు ఇష్టపడలేదు.

ఆ రోజుల్లో ఆ ప్రాంతంలో క్వార్క్ దొరగారు దేవుని సేవకులుగా వున్నారు. ఆ దొరగారిని సంప్రదించగా యేసును స్వీకరించి నలభై రోజుల్లో ఉపవాస ప్రార్థనలు ఉండమన్నారు. అది నెరవేరిన తర్వాత వివాహము జరిగినది. వివాహమైన రోజునే కాళికామాత 'నన్ను వదిలేస్తావా? నిన్ను మింగేస్తాను' అంటూ భయంకరమైన రూపములో మీదికి వచ్చింది. అయితే మా నాన్నగారి వెనుక గోడమీద వున్న యేసు పటములో నుండి బయటకి వచ్చి 'భయపడవద్దు, భయపడవద్దు' అని మూడుసార్లు చెప్పాడు. కాళికామాత మరలా కనిపించలేదు. నాటినుండి మా తండ్రి బొర్రాలో క్రైస్తవునిగా స్థిరపడిపోయారు.

మా ఇంటిలో నేను మూడవ బిడ్డను. దేవుడు నన్ను ప్రత్యేకించినాడు. మా అమ్మ మమ్ములను దైవభక్తిలో, గౌరవ మర్యాదలతో పెంచినది. ఆమె చాలా ప్రార్థనాపరురాలు. ఆమె ఉదయకాలము మూడు గంటలకు లేచి ప్రార్థించేది. బొర్రాలో మేమొక్కరిమే క్రైస్తవ కుటుంబము. మా తల్లిదండ్రులు ఆ గ్రామములో అనేకులను ప్రభువు వద్దకు నడిపించారు. ఆ గ్రామములో ఒక చర్చి నిర్మించి మా నాన్నగారే దానిని నడిపించారు. నేను బొబ్బిలిలోని కెనెడియన్ బాప్టిస్టు సంఘ వసతి గృహములో 1976 నుండి 79 వరకు 8 నుండి 10వ తరగతి వరకు చదివాను. అక్కడ దేవుని శక్తిలో చాల పెంచబడ్డాను. రెవ. వింజమూరి విమల్‌కుమార్ శర్మగారు, వారి సతీమణి ఐరిస్‌గారి ఆధ్వర్యములో నడిపించబడుచున్న సంస్థ. ఐరిస్ అమ్మగారి ఆధ్వర్యములో దేవునిలో పెంచబడ్డాను. దేవునికి మహిమకరముగా దేవునికి లోబడినాను. ఆయన నన్ను అనేకమైన మేళ్ళతో నింపారు.

వారి రెండవ కుమారుడు విజయకుమార్‌గారు 1981లో డిగ్రీ తీసుకొనిన తర్వాత ఒక యౌవనస్తుల కూడికలో యేసుప్రభువును తన స్వరక్షకునిగా స్వీకరించి సైకిల్ మీద గ్రామాలలో తిరిగి ప్రభువు సేవ చేస్తుండేవాడు.

1982 ఫిబ్రవరి 17న విజయకుమార్‌గారితో నా వివాహము విజయనగరం ప్రక్కన వున్న నీలాయమ్మ సత్రము దగ్గరవున్న శాంతమ్మగారి జ్ఞాపకార్థము స్థాపించిన చర్చిలో రెవ. సామ్యుల్ మార్టిన్‌గారిచే జరిగించబడింది. అక్కడే మామగారు శర్మగారి తల్లి శాంతమ్మగారి జ్ఞాపకార్థం నడిపించ బడుచున్న చర్చి, హాస్టలు ద్వారా సేవ చేయుచు వివాహ జీవితం ప్రారంభమయింది. నా భర్త రెండు సంవత్సరాలు శ్రమించి అక్కడ కొన్ని కట్టడాలు కట్టించారు.

1984 జూన్ 25న నా పెద్ద కుమారుడు అనిల్ దేవదత్త జన్మించాడు. మా బావగారు సుకుమార్‌గారు నీలాయమ్మ సత్రము వద్ద శాంతమ్మ జ్ఞాపకార్థ సంస్థలో పని ప్రారంభించారు. 1988 నవంబరు 20న అనంతరాజ్‌శర్మను దేవుడు మాకు రెండవ బహుమానముగా అనుగ్రహించాడు.

1995లో మా అత్త ఐరిస్‌గారు ప్రధానోపాధ్యాయినిగా పదవీ విరమణ చేసినందున బొబ్బికి మూడు కిలోమీటర్ల దూరంలోని టామ్‌కాక్స్ కాంపౌండులోని 17 ఎకరాల మామిడితోట మధ్యలో ఒక ఎకరం పూలతోటవేసి పదిమంది వృద్ధులకు వసతి కల్పించి మందిరం కట్టించి అక్కడ నుండి సేవ ప్రారంభించాడు.

మా మామయ్య శర్మగారు, అత్త ఐరిస్‌గారు నన్ను తల్లిదండ్రులవలె భావించి వారు నిర్వహించిన పనిని నాకప్పగించారు. చర్చిల్‌గారు అనబడే మిషనరీ వంద సంవత్సరాలకు పూర్వం స్థాపించి నడిపించిన హాస్టలు ఇప్పటికీ అదే క్రమశిక్షణలోను, ప్రేమలోను నడిపించబడు తుంది. అవే గదులు, అదే వంటగది, అవే బాత్‌రూంలు. ఆవరణలో చర్చికి త్రవ్వించిన రెండు బావులు ఇప్పటికీ సమృద్ధి జలముతో నిండియున్నవి. ఎప్పుడైనా ఒక ద్వారము మూయబడితే ప్రభువు ఏడు మార్గాలు తెరుస్తున్నాడని శరణాలయము నడిపించుటలో మాకు ఇది రుజువైంది. నా తోడికోడలు నా సొంత అక్క కన్నా ప్రేమగా చూస్తుంది.

2001 వరకు ఈ శరణాలయము అంతటికి కలిపి ప్రత్యేక ప్రార్ధనా మందిరము లేదు. అందుకోసం ప్రార్ధించాను. దేవుడు ఆశ్చర్యకరమైన రీతిలో ప్రధాన ద్వారము ప్రక్కనే ఒక మందిరము ఏర్పాటు చేశాడు. అప్పటి నుండి ఈ ఆవరణలో పనిచేయు వారందరు. ఉదయారాధన జరిపి తమ తమ పనులలో ప్రవేశిస్తారు. సాయంకాలం పనులు ముగించి మరలా ఆరాధనలో పాల్గొని వెళ్తారు. 2002 నుండి ఈ మందిరములో ప్రతి శుక్రవారం, మంగళవారం ఎస్తేరు స్త్రీల సహవాసం వారు ఉపవాస ప్రార్ధన ప్రారంభించి అనేక మేళ్ళు పొందారు. 2007లో థాయ్‌లాండ్ దేశములోని చంగ మలన్‌లో జరిగిన ఆసియా స్త్రీల కూడికకు సి.బి.యం. ఎస్తేరు స్త్రీల సహవాసం తరపున హాజరై ప్రసంగించాను.

ప్రారంభంలో మూడు వారాలు ఉపవాస ప్రార్ధనలు చేశాము. ఈ సహవాసము నడపించుటకై మంచి దైవజనురాలిని పంపించమని ప్రార్ధించగా దేవుడు ఒక బ్రాహ్మణ కన్వర్ట్ మేరీని పంపించాడు. పదిహేను సంవత్సరాలుగా సంతానంలేని వారికి సంతానము కలిగించాడు. వివాహమునకై అనేక సంవత్సరాలుగా ఎదురు చూచిన వారికి వివాహములు జరిగినవి. ఎస్తేరు సహవాసం వారు సేవకు వెళ్ళటానికి ఒక వాహనము కావాలని ప్రార్ధించాము. దేవుడు ఒక మిని బస్‌ను ఇచ్చాడు. శరణాలయములోని ఒక బాలిక తల్లికి కలిగిన క్యాన్సరు వ్యాధిని ప్రభువు బాగుచేశాడు.

నర్సు ట్రైనింగ్‌కి దేవుడు మార్గము తెరిచాడు. రమా అనే అమ్మాయికి తీవ్రమైన ఉబ్బు కామెర్ల వ్యాధిని బాగు చేశాడు. ఒక వ్యక్తి గుండెజబ్బుతో చనిపోతాడని డాక్టరు చెప్పారు. ఎస్తేరు సహవాస ప్రార్ధనలో అతనిని ప్రభువు రక్షించాడు. శరణాలయంలోని పిల్లలు ఉదయం నాలుగున్నరకి నిద్రలేస్తారు. 5 నుండి 6 వరకు ప్రార్ధన నడిపించబడుతుంది.

ఆరున్నరకి భోజనశాలలో చేరి ప్రార్ధించిన తర్వాత అల్పాహారము, మధ్యాహ్న భోజన సమయంలో ప్రార్ధన, వాక్యము వుంటుంది. అదే విధంగా సాయంకాలం –మూడు పూటల ప్రార్ధనతోనే గడుస్తుంది. మంగళవారం బాలికలు ఉపవాస ప్రార్ధనలోను, శుక్రవారం బాలురు ఉపవాస ప్రార్ధనలోను ఉంటారు. ఆదివారం ఉదయం పది గంటలకు ఆరాధన మధ్యాహ్నం రెండు గంటలకు 'క్రిష్టియన్ ఎండోవర్' నడిపించుకుంటారు. నెలకు రెండు వాక్యాలు ఒకటి తెలుగు, ఒకటి ఇంగ్లీషు నేర్చుకుంటారు. మామయ్య శర్మగారు, అత్తమ్మ ఐరిస్‌గారు ప్రారంభించి నడిపించిన సేవను నా భర్త విజయకుమార్‌గారు, నేను కొనసాగిస్తున్నాము. మా కొరకు ప్రార్ధించండి.

నా చిన్నతనంలో నేను, నా చెల్లెలు జయ, నా అన్న సెలవలకు కొండ ప్రాంతంలో చక్కని అడవిలో వున్న మా వూరికి వెళ్ళేవారము. మా అమ్మ మా కొరకు కొత్త చెప్పులు తయారు చేయించి వుంచేది. మా యింటికి ఎప్పుడూ సువార్తికులు వస్తుండేవారు. వారితో కలసి మేము సేవకి వెళ్ళి ఆ కొండరాళ్ళలో నడచేవారము. సెలవులు అయిపోయే టప్పటికి మా చెప్పులు అడుగు భాగమంతా రంధ్రాలు పడివుండేవి. ఆనాడు ఆ విధంగా ప్రభువు సేవచేసినందు వలననే దేవుడు నన్ను ఈ విధమైన ఉన్నత స్థితిలో వుంచి భర్తతో కలసి సేవ చేయుటకు ఉపయోగించుకుంటున్నాడని అనుకుంటున్నాను. మా గ్రామము బొర్రా గేటు వలస. బొర్రా యాత్రా స్థలము. భయంకరమైన అడవి. విజయనగరం జిల్లా, అరకు మండలంలో ఎక్కువమంది ఒడియా భాష మాట్లాడు తారు. ఇంకా అనేక భాషలు మాట్లాడేవారున్నారు. అక్కడికి సువార్త సేవకులు వచ్చినప్పుడు వారికి ఆ భాష రాదు గనుక మేము వారికి భాషను తర్జుమా చేస్తూ వుండేవారం. ఎంతమంది సువార్తికులు ఎన్నిసార్లు మా యింటికి వచ్చినా మా అమ్మ ప్రేమగా, ఓర్పుతో వారికి ఆతిధ్యమిచ్చేది.

ఈ ఆవరములో మా నివాసస్థలమును ఆనుకొని మూడు సమాధులు వున్నాయి. దాదాపు వంద సంవత్సరా లకు ముందే విదేశాల నుండి యేసు వార్త ప్రకటించుటకు అనేక అపాయములను ఎదుర్కొని, సముద్రయానం చేసి వచ్చి అనాగరికి, అనారోగ్య పరిస్థితులలో సేవచేసి, ఇక్కడ నుండే ప్రభువు చెంతకు చేరిన చర్చిల్ దొర, ఆయన ఇద్దరు కుమారుల సమాధులే అవి. మేము సి.బి.యం. ఆవరణలో వుండి ఎంతసేవ చేసినప్పటికీ చర్చిల్ దొర కుటుంబము వారు ఇక్కడ చేసిన సేవకు గాని, మా అత్తగారు ఐరిస్‌గారు ఇక్కడ సేవ చేసి ప్రభువు చెంతకు చేరిన వారి సేవలో కాని మాసేవ చాలా అల్పమని, ఈ సేవలో ప్రభువు మమ్మును ఇంకా ముందుకు నడిపించాలని ప్రార్ధిస్తున్నాను.

ఆ దేవదేవునికి వందనములు. నా సాక్ష్యము మీకు ఆశీర్వాదకరముగాను దేవునికి మహిమకరముగాను ఉండాలని ఆశిస్తున్నాను. నా కుమారులిద్దరూ డాక్టరు కోర్సు చదువుచున్నారు. వారిద్దరు కూడా ఈ సేవలో దేవుని మహిమార్ధమై దేవుని కొరకై వాడబడాలని దేవుని ప్రార్ధిస్తున్నాను.

**– వింజమూరి వసంతకుమారి**

# Paul and Silas were Praying and Singing Songs
## (Acts 16:25)

Greetings to the readers of "Hanna Krupa" magazine in the precious name of out Lord and Saviour Jesus Christ. Our God is our refuge and we should always be happy in all the circumstances. Paul and Silas were persecuted for no fault of theirs. They were scolded, beaten severely for having saved a girl, from the slavery of demon in Philippi. They were put in jail and the jailor took all precautions so that they would not escape. At that time Paul and Silas, instead of grumbling, they were praying and singing. We have to take God's testimonies as an heritage forever as they are the rejoicing of our heart.

Paul and Silas were happy amidst suffering. The joy of the believers is not conditioned by outward circumstances. God's power is made perfect in weakness. Paul Says in 2Cor.12:10, "I can take pleasure in infirmities, in reproaches, in necessities, in persecutions, in distresses, for Christ's sake, for when I am weak, then I am strong, "God can transform our limitations into our heavenly advantages. Our weakness in a blessing when we lean on God's strength.

Paul and Silas were delivered by an earth quake and this resulted in further progress for the gospel the salvation of the jailor and the members of his family. When there was an earthquake, the prison's foundations were shaken the prisons doors were opened and the chains that tied the prisoners were loosened. This incident was clearly a natural event occurred in the right place and at the right time, accomplishing God's intended purpose to free His servants. The jailor was shocked thinking that all the prisoners had escaped and he was afraid that he would be hanged. But to his pleasant surprise, Paul declared that all the prisoners were there and nobody escaped. The jailor having observed their faith, asked them what he should do in order to get saved, the most important question one could ask. Paul replied that one has to believe in the name of Jesus Christ and focus his faith and commitment in the Lord Jesus. One has to believe that Jesus is the son of God. One should draw near him, remain in Him and commit his troubled life to Him with assurance that He will lead him through, to the eternal presence of the Lord. The jailor along with the members of his family got baptized. This signifies an end to the life of sin and the beginning of a new life in Christ. We must turn our back on the world and all that is evil, and live a new life in the spirit that reflects God's righteousness. We are in God's hands, no matter what others are saying about us. He is seeing our distress, and in time, He will repay us for the cursing we have received. So let us trust in Him and abide in His love. We can endure life's wrongs because we know that God will make all things right. So let us remain steadfast in serving him all our days. Paul determined to finish his race with joy.

We have to see how Habakkuk demonstrated his supreme faith in God when he declared, that even if the fruit trees, the fig trees, the olive trees and vines produce no

crops, or if the fields yielded no harvest and the animals died and there were no flocks, he would still trust in God. Outward circumstances would never cause him to leave God. The joy of the Lord is ever the believer's portion and it is never out of season. Those who trust God, will find their strength in Him. God is our refuge and strength and a very present help in trouble. Our witness for Christ is the light for a world of darkness. We must cast all our care upon Him for He careth for us.

Loving God is easy for us, when He grants our requests and provides what we desire, but loving Him in difficult circumstances is not that easy and our faith is put to a test. In Daniel 3rd Chapter we read of the life and death decision, Shadrach, Meshach and Abednego, had to make. If they chose to worship the golden image, they would live. If they refused they would be cast into the midst of a burning fiery furnace. They hoped, that their living God would deliver them from the burning fiery furnace and out of the hand of the king Nebuchadnezer and they were prepared to die even if their God did not deliver them. They were firm in not worshipping the idol. In Heb.13:5 we read "I will never leave thee nor forsake thee". The reason we can be content with little or nothing in this life, is the promise of God. When Shedrach, Meashach and Abednego were thrown in to the heated furnace, the king Nebchadnezer could see a fourth person with the three and they were not put to harm in the furnace. The king was surprised and understood the might of God and he turned from one extremity to another God is all powerful. We must trust him and have hope in Him in spite of the trials that threaten to overwhelm us.

When Job's wife asked Job to stop loving God, as he had to face distress, Job gave her an apt reply, "shall we receive good at the hand of God and shall we not receive evil?" Job continued to trust God, when he faced the worst circumstances. Isa.34:20 says, the Lord redeemeth the soul of servants and none of them that trust in him shall be desolate. In Proverbs 29:25 we read that the fear of man bringeth a snare but whose putteth his trust in the lord shall be safe. We must cling to the Lord in prayer. When we obey God the bitter circumstances of our lives can become sweet. God uses our difficulties to make us better but not bitter. May God bless you all.

**S. Kamalamma**
Principal
Y.S.V.R.M. Girls Colleges, Pulivendula

## చందా వివరములు

హన్నాకృప పత్రిక ప్రతినెల 1వ తేదీన ఒంగోలులో పోస్టు చేయబడుతుంది. ఇంతవరకు ఒక్క నెలైనా ప్రచురణ తప్పిపోలేదు. పత్రికకు వచ్చే సహాయము ప్రతి రూపాయిని మేము ప్రతినెలా పత్రికలో ప్రచురిస్తున్నాము. ఆ పట్టికను పరిశీలిస్తే పాఠకులైన చందాదారుల వలన ఈ పత్రిక నడిపించబడుట లేదని, ప్రభువును ప్రేమించిన బిడ్డలు ప్రభువుచే ప్రేరేపించబడి ఆర్థిక సహాయం చేస్తున్న వారి ద్వారా మాత్రమే ఈ పత్రిక నడిపించబడుతుందని తెలుస్తుంది. కనుక చందా వివరములను పత్రికలో ప్రచురించటం లేదు. ప్రేరేపించబడిన వారు ఆన్‌లైన్ ద్వారాగాని, మనియార్డరు ద్వారాగాని, స్వయముగా గాని అందించవచ్చును.

# వారి బాటలో..... ౭

చర్చిల్ అమ్మగారు తన బోర్డింగ్ కర్తవ్యాలను నిర్వర్తించు కుంటూ స్త్రీల మధ్య కూడా సేవ చేశారు. గుర్రము మీద లేక ఎడ్ల బండి మీద ఆయా గ్రామాలను దర్శించి గ్రామం వెలుపల టెంట్లు వేసుకుని రాత్రి పూట గ్యాస్ లైట్ వెలుగులో పాటలు పాడుతూ దేవుని వాక్యము అందించుచుండెడివారు. మిషను ప్రాంతంలో స్త్రీల మధ్య సేవలు గుర్తించి పారన్ మిషన్ బోర్డు వారు లేడి మిషనరీస్ వారిని మన దేశము పంపించారు. వారు బొబ్బిలి కూడా వచ్చి చర్చిల్ అమ్మగారికి సహాయం చేస్తుండేవారు. అక్కడ నుండి వచ్చిన వారిలో నోవల్స్ అమ్మగారు, రిగ్స్ అమ్మగారు మరియు క్లటన్ అమ్మగారు మొదలగువారు సేవలు చేస్తుండే వారు. వీరికి సహాయముగా వుండుటకు కొంతమంది స్త్రీలకు బైబిల్ శిక్షణ ఇప్పించి బోధకురాండ్రుగా వాడుకునే వారు. వీరి కొరకు పాలకొండలో బైబిల్ శిక్షణా స్కూలు స్థాపించిరి. తరువాత ఈ స్కూలు తునికి మార్చబడినది. తునిలో ఇంకనూ బైబిల్ శిక్షణా స్కూలు నడిపించబడుతున్నది.

స్థానిక క్రైస్తవులకు పరిపాలన బాధ్యత ఇవ్వాలనే ఉద్దేశ్యముతో కొన్ని సంఘాలను చేర్చి ఫీల్డ్ కౌన్సిల్ అనే వ్యవస్థను మిషనరీ వాళ్ళు స్థాపించిరి. ఈ ఫీల్డ్ కౌన్సిల్‌కు ఒక ఫీల్డ్ మినిస్టర్‌ను నియమించి ఆయన ద్వారా సేవ జరిపిస్తూ వుండేవారు. ఈ ఫీల్డ్ కౌన్సిల్‌లో ప్రెసిడెంటు, సెక్రటరీ మరియు ట్రెజరర్‌లను స్థానిక క్రైస్తవులు ఎన్నుకొనే వారు. ఈ ట్రెజరర్‌కు కొంత సొమ్మును ఖర్చుల కొరకు మిషనరీ వారు ఇచ్చేవారు. కొన్ని దినాలకు ఆర్థిక సమస్యలు రావడంతో ఈ ఫండ్స్ ఆపేశారు. కాని ఇప్పటి వరకు ఫీల్డ్ కౌన్సిల్ వ్యవస్థ నడుస్తూనే వుంది. మిషన్ ఎలిమెంటరీ స్కూల్స్ కరస్పాండెంటు ఆ ఎలిమెంటరీ స్కూల్స్ పరిపాలన దక్షత ఈ ఫీల్డ్ కౌన్సిల్ నిర్వర్తిస్తూ ఉండేది. టీచర్స్ మరియు ఆఫీసు స్టాఫ్ జీతాలు మాత్రం మిషనరీస్ వారే ఇస్తుండే వారు.

1947లో భారతదేశానికి స్వాతంత్ర్యము వచ్చిన తదుపరి 1948లో సి.బి.సి.యన్.సి (కన్వెన్షన్ ఆఫ్ బాప్టిస్ట్ చర్చస్ ఆఫ్ ది నార్తరన్ సర్కార్స్) అను కన్వెన్షన్‌ను స్థాపించి దానికి సరైన నిబంధనావళి సిద్ధపరిచారు. ఈ కన్వెన్షన్ ప్రతి సంవత్సరం జనవరి నెలలో కూడుకొని ఆఫీసు బేరర్స్ ప్రెసిడెంటు, కార్యదర్శి, ట్రెజరర్ మొదలగు వారిని ఎన్నుకొనే వారు. ఈ కన్వెన్షన్‌కి కావలసిన నిధులు ఫారన్ మిషన్‌బోర్డు వారు పంపించేవారు. భారత సర్కారు వారు మిషనరీ వారికి వీసాలు ఇవ్వడానికి నిరాకరించిన తర్వాత ఒక్కొక్క మిషనరీ తిరిగి వారి దేశాలకు వెళ్ళిపోయి ఈ కన్వెన్షన్ బాడీకి పూర్తి దక్షత అప్పజెప్పారు. 1972 నాటికి పూర్తిగా నిధులను ఆపేశారు. కన్వెన్షన్ సంఘములు స్వయం ప్రాతిపదికపై నడవాలి అనే సదుద్దేశ్యంతో నిధులను ఆపేశారు. కొంత కాలానికి ఈ కన్వెన్షన్‌లో పదవీ కాంక్ష, బహునాయకత్వం వలన పరిస్థితి చాలా విషమించి నాయకులు కోర్టులను ఆశ్రయించవలసిన దయనీయ పరిస్థితి వచ్చింది. సంఘాలు బలహీనమైపోయి సేవ కుంటుపడింది. మిషనరీలు వదలి వెళ్ళిన ఆస్తులు, భవనాలు, స్కూల్సు వీటిని అమ్మాలనే ప్రయత్నంలో ఎంతోమంది అన్యులు చొరబడి క్రైస్తవత్వానికి తలవంపులు తెచ్చారు.

బొబ్బిలి చాలా చారిత్రాత్మకమైన ప్రదేశము. బొబ్బిలి రాజులకు, విజయనగర రాజులకు మధ్య జరిగిన బొబ్బిలి యుద్ధం చారిత్రాత్మకమైన ఘట్టం. బొబ్బిలియుద్ధం అనే బుర్రకథలు ఆంధ్రదేశంలో ఎంతో మంది చూసి ఆదరించారు. ఇటువంటి బొబ్బిలి సంస్థానం వారి దగ్గరకు మిషనరీస్ వచ్చి ఎన్నో కష్టనష్టాలు పడి వారి ప్రాణాలను సైతం త్యాగం చేసి, వారి బిడ్డలను కోల్పోయి, దేవుని సేవయే వారి ధ్యేయంగా చేసుకొని, ఈ అంధకారంలో వున్న మారుమూల ప్రదేశాలను వెలుగులోకి తీసుకువచ్చారు.

అటువంటి మహాత్యాగమూర్తుల బాటలో నడుచుటకు దేవుడు మాకు ఇచ్చిన గొప్ప అవకాశమునకు మేము కృతజ్ఞులము. 1964లో ఫ్రెకెల్టన్ అమ్మగారు మిషనరీగా వున్నప్పుడు నా భార్య ఐరిస్‌రాజితమును సి.బి.యం. బాలికల ప్రాథమిక పాఠశాలకి ప్రధానోపాధ్యాయురాలిగా

నియమించారు. 1968లో ఉన్నత పాఠశాలగా అయింది. 1969 ఏప్రిల్‌లో ఫ్రెకెల్టన్ అమ్మగారు ఈ ప్రాంతం సేవను మాకు అప్పజెప్పి వారి దేశం వెళ్ళిపోయారు. మిషనరీ వారు ఎవ్వరూ మనదేశంలో లేరు. సి.బి.యం. గర్ల్స్ బోర్డింగ్‌లో అప్పటికే 74 మంది పిల్లలు వున్నారు. 1972లో ఫారన్ మిషన్‌బోర్డు వారు నిధులను ఆపేశారు. అటువంటి క్లిష్ట సమయంలో వనరులు లేక బోర్డింగ్‌ను మూసేసి పిల్లలను ఇంటికి పంపించాల్సి వచ్చింది. కాని మన దేవుడు గొప్పవాడు. అదే సమయంలో వరల్డ్ విజన్ ఆఫ్ ఇండియా అనే ఒక సంస్థ ముందుకు వచ్చి మొదటిగా 14 మంది పిల్లలకు సహాయం చేసి తరువాత 28 పిల్లలకు తరువాత 100 మంది పిల్లలకు సహాయం పంపిస్తూ వుండేవారు.

1976లో అవసరతను చూసి 250 మంది పిల్లలకు సహాయం పంపించేవారు. అదే సమయంలో ఆస్ట్రేలియా నుండి వచ్చిన మిషనరీలను పూజ్యులు లేటు రెవ.పి. సదానందంగారు మా ప్రాంతాలకు తీసుకువచ్చి మా సేవలు వారికి చూపించి 120 మంది పిల్లలకు సహాయం ఏర్పాటు చేశారు. ఈ విధంగా మిషనరీ వారు వదలి వెళ్ళిన తరువాత 74 మంది పిల్లలు ఇంటికి వెళ్ళే పరిస్థితి వచ్చినపుడు దేవుని కృప వలన 370 మంది పిల్లలకు నిధులు వచ్చాయి. ఇది దేవుని కార్యము అని తలుస్తున్నాము. సి.బి.యం. బాలికల ఉన్నత పాఠశాల కూడ చాల అభివృద్ధి పొంది ఈ ప్రాంతం విద్యార్థులకు విద్యనభ్యసించుటకు మరియు క్రమశిక్షణకు ఎంతగానో దోహదపడింది. నా భార్య ఐరిస్‌రజితం 1997లో ప్రభువునందు నిద్రించినది.

తర్వాత నా కుమారులు రెవ.సుకుమార్, రెవ.విజయ కుమార్‌లు ఇద్దరూ సంస్థను అభివృద్ధి పరుస్తున్నారు. అమెరికా నుండి టామ్‌కాక్స్ ఇవాంజలిస్టిక్ అసోసియేషన్ ద్వారా కొన్ని వనరులు వచ్చాయి. వరల్డ్ విజన్ వారు 1990లో వారిచ్చే నిధులను ఆపివేయడం జరిగింది. వెంటనే ఈ టామ్‌కాక్స్ ఇవాంజలిస్టిక్ అసోసియేషన్ వారు ఆదుకుని సహాయం చేశారు. ప్రస్తుతం బోర్డింగ్ హోంలో 350మంది పిల్లలతో రెవ. విజయకుమార్, తన భార్య వసంత కుమారి నడిపిస్తున్నారు. మరియు మారుమూల ప్రదేశాలలో 46 చర్చీలు నిర్మించి కాపరులను నియమించి దేవుని సేవ చక్కగా చేస్తున్నారు. రెవ. సుకుమార్, తన భార్య పద్మలత, విజయ నగరం ప్రాంతంలో మంచి సేవ చేస్తున్నారు. దేవుడు ఇచ్చిన ఇద్దరు బిడ్డలు ఈ విధంగా సేవ చేయుటకు అవకాశం కల్పించి అలనాటి మిషనరీల బాటలో నడుచుటకు అవకాశం ఇచ్చినందుకు దేవునికి వందనములు.



**క్విజ్** **47**

# అక్టోబర్ నెల ప్రశ్న?

పాఠకులను వాక్యపు జ్ఞానంలో పెంచటమే ఈ శీర్షిక ఉద్దేశ్యం.

1. **కుడిచేతి పుత్రుని సంతతిలో ఎడమచేతివాటము గల వారు అధికము. వారెవరెవరు?**
2. **న్యాయాధిపతులలో అధికులు ఏ గోత్రమునకు చెందినవారు? అట్లు వుండుటకు కారణము ఏమిటని మీరు భావించుచున్నారు? (మీ సొంత అభిప్రాయము)**

**జవాబుల కొరకు న్యాయాధిపతుల గ్రంథం చదవండి**

**సెప్టెంబర్ నెల ప్రశ్నలకు జవాబులు :**

1. 'గుఱ్ఱముల గుదికాలి నరములు తెగవేసెన'ను కార్యములోని ఉద్దేశ్యమేమి?

**జవాబు:** గుఱ్ఱములు తిరిగి ఉపయోగపడకుండా, పనికి మాలిన వాటిగా చేయుట కొరకు. ద్వితీ.17:16లో ఆజ్ఞాపించిన ప్రకారము గుఱ్ఱములను విస్తారముగా సంపాదించకుండా వుండుటకు. 2సమూ.8:4లో దావీదు చేసిన పనిని గమనించండి.

2. ప్రత్యక్ష సాక్షి కథనం ప్రకారం ఇశ్రాయేలీయులు అరణ్యములో నడచినది ఎన్ని సంవత్సరములు?

**జవాబు :** కాలేబు మాట చొప్పున 45 సంవత్సరములు యెహోషువ 14:10

3. కనానులో లేవి గోత్రమునకు ఇవ్వబడిన స్వాస్థ్యము ఏది?

**జవాబు :** యెహోవాయే వారికి స్వాస్థ్యము 13:33, ఆయనకు అర్పింపబడే హోమములే వారికి స్వాస్థ్యము 13:14.. గాని ప్రతి గోత్రమునకు ఇవ్వబడిన భాగములో కొన్ని పురములు లేవీయులు నివశించుటకునూ, ఆ పురములను ఆనుకొని యున్న పల్లెలు వారి పశువులకు ఇవ్వబడెను.

**సరియైన జవాబు వ్రాసిన వారు :**
**శ్రీమతి యం. సత్యవతి జాకబ్, నెల్లూరు**
**శ్రీమతి బత్తుల ఆనీమేరి, హైదరాబాదు**
**శ్రీమతి పి.జె. సత్యవాణి, తెనాలి**
**శ్రీమతి బి.ఎ. లాజరస్, నిడదవోలు**

## కృతజ్ఞతలు

**సెప్టెంబరు 14వ తారీఖున స్వర్గీయ శ్రీమతి హన్నాకృపాదానంగారి 93వ జన్మ దినము పురస్కరించుకొని 'హన్నాకృప' పత్రిక యొక్క 9వ వార్షికోత్సవమును సెప్టెంబరు 13వ తేదీ శనివారం ఒంగోలు 'చర్చ్ ఆఫ్ ది లార్డ్' ఆలయమునందు జరుపబడినది.**

**వార్షికోత్సవము జయకరంగా జరిగించుటకు విచ్చేసిన పాఠకులందరికీ మా హృదయ పూర్వక కృతజ్ఞతలు.**

## ఎస్.యం.ఎస్. పరిచర్య



ఎవరైనా ప్రతిరోజు దేవుని వాక్యము ఉచితంగా పొందగోరినచో లేదా మీ ప్రియులకు పంపగోరినచో **9908822365** నెంబరును సంప్రదించగలరు.

ప్రతిరోజు 'హన్నాకృప' పాఠకులకు, శ్రేయోభి లాషులకు, మిత్రులకు దేవుని వాక్యము SMS చేయుటకు ప్రియులు **ఎ.యన్.ఆర్.జక్కంగారు** ప్రతినెల రూ.1000/- అందించుచున్నారు. వారికి వందనములు. ఈ పరిచర్య ద్వారా ఎంతోమంది ఆత్మీయ మేలులు పొందుచున్నందుకు దేవునికి స్తోత్రములు చెల్లించుచున్నాము.



# డాక్టర్ మేరియన్ బేర్

**(మెడికల్ మిషనరీ 1953-1991)**

నేటి తరానికి డా॥ బేర్ ఎవరో అనే విషయం తెలియదు. నేటికి 55 సంవత్సరాల క్రితం దేవుని పిలుపు కలిగి మన దేశానికి వచ్చి మన ఆహారపు అలవాట్లు నేర్చుకొని మన ప్రజల మధ్య ఘనమైన వైద్య సేవలందించిన ఒక మంచి డాక్టర్. నెల్లూరు రైల్వే ఫీడర్స్ రోడ్డులోని బాప్టిస్టు క్రైస్తవ ఆసుపత్రిలో పేరు ప్రతిష్టలు ఎవరెస్టు శిఖరమంత ఎత్తుకు తీసుకెళ్ళిన మెడికల్ మిషనరీ ఈ డాక్టర్ మేరియన్ బేర్.

డాక్టరమ్మ పూర్తి పేరు మేరియన్ ఒలేట బేర్. అమెరికాలో నెబర్క అనే ప్రాంతంలోని లాంగ్‌పైన్ అనే గ్రామములో డా॥ ఇర్విన్ బేర్, శ్రీమతి అల్టా విలియంబేర్ అనే దంపతులకు 1926 జూలై 24న జన్మించింది.తన తండ్రి విలేజి డాక్టర్, తల్లి సంగీతం నేర్పిస్తుంది. తనకి ఒక సహోదరుడు వున్నాడు. తన తల్లి చనిపోవడంతో తండ్రి రెండవ వివాహం చేసుకున్న కారణంగా తన మారు తల్లి తనను చట్టప్రకారం తన కుమార్తెగా దత్తత తీసుకుంది.

మేరియన్ తన తల్లిదండ్రులతో తన 14వ యేట పోర్టులాండ్ వెళ్ళారు. అక్కడ తన తల్లిదండ్రులు ఫస్ట్ బాప్టిస్టు చర్చిలో సంఘస్తులుగా చేరుటను బట్టి మేరియన్ ఆ సంఘములో బాప్తిస్మం తీసుకుంది. మేరియన్‌కి డాక్టర్‌గాగాని, నర్సుగాగాని కావాలని లేదు. కాని ఆమెకిష్టమైన కెమిస్ట్రీలో పి.హెచ్‌డి. చేయాలని ఆశించింది. కాని దేవుని చిత్తం వేరుగా వుంది. ఆమె మెడికల్ మిషనరీగా కావాలని. 1950లో చికాగోలో నార్త్ వెస్ట్రన్ యూనివర్సిటీ మెడికల్ స్కూల్ పట్టా పొందింది. చికాగోలో వైద్య విద్య చదివే సమయంలో రాత్రులలో మూడి బైబిల్ ఇన్‌స్టిట్యూట్‌కి వెళ్ళేది. 1951లో అమెరికన్ బాప్టిస్టు ఫారిన్ మిషన్ సొసైటీ వారు ఆమెను మిషనరీగా ఏర్పాటు చేసినందున కెన్నడి స్కూల్ ఆఫ్ మిషన్స్‌లో ఆరు నెలలు ఇస్లాం, హిందూ మతాల గురించి మరియు భారతదేశ సంస్కృతి గురించి చదివి 1953 మార్చిలో ఓడలో ఇండియాకు బయలుదేరింది.

ఇండియాకు వచ్చి ఎనిమిది నెలలు రామాయపట్నంలో తెలుగు నేర్చుకొని ఒంగోలు క్లౌ మెమోరియల్ ఆసుపత్రిలో కొంతకాలం పనిచేసి 1955లో నెల్లూరు ఎ.బి.యం. హాస్పిటల్‌కి బదిలీ అయింది. అప్పటి నుండి ఆమె 1991లో మెడికల్ సూపరింటెండెంటుగా రిటైరయ్యే వరకు నెల్లూరు మిషన్ ఆసుపత్రి లోనే రోగులకు సేవచేశారు. డా॥ మేరియన్ బేర్ తన సేవా జీవితంలో 36 వేల ఆపరేషన్స్ చేసి అందరి మన్ననలు పొందారు. ఆమెను బేరమ్మ అని పిలుచుకొనే ఆప్తురాలిగా, అమ్మగా అందరి హృదయాల్లో స్థానం సంపాదించుకున్న డాక్టరు ఆమె. ఆమెకు పేదవారు, గొప్పవారు అనే బేధంలేదు. పేద, గొప్పవారిని ఒకేవిధంగా చూచేవారు. అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన బేరమ్మ పోర్టులాండ్‌లో తన స్వంత అపార్ట్‌మెంటులో 82 సంవత్సరాల ప్రాయంలో ఆరోగ్యంగా, ఉల్లాసంగా, హుషారుగా వున్నారంటే అంతా దేవుని కృపే. మంచి పనులు చేసిన వారెప్పుడూ మనుష్యుల గుండెల్లో గూడు కట్టుకొని వుంటారని వేరే చెప్పనవసరం లేదు.

సమావేశములో పనిచేసిన మిషనరీలను, యస్టీబీసి నాయకులుగా వున్న ఏ ఒక్కరు కూడా, వారి జ్ఞాపకార్థం ఏ కార్యము చేయలేదు. వారికి ఆ తలంపు రాకపోవడం దురదృష్ట కరం. బాప్టిస్టు మిషన్ ఆసుపత్రిలో పనిచేసి రిటైరైన కొందరు కలిసి ఆలోచించి 2000వ సంవత్సరంలో చిన్న చర్చిని ఏర్పరచు కొని డా॥ బేర్ అమ్మను గుర్తుంచుకునే విధంగా దానికి బేర్ బాప్టిస్టు చర్చి అని పేరు పెట్టుకొని, బాప్టిస్టు మిషన్ ఆసుపత్రి చాపల్‌నందు నేటికి ఎనిమిది సంవత్సరముల నుండి ఆదివారపు ఆరాధనలు జరుపుకుంటున్నారు. బేర్ బాప్టిస్టు చర్చి సభ్యులు కేవలం 25 మంది చిన్న సంఘమైనా పెద్ద ఉద్దేశాలు కలిగి ఫిలిప్పి. 4:13 ప్రకారము ''నన్ను (మమ్ము) బలపరచు వానియందే నేను (మేము) సమస్తమును చేయగలను (చేయ గలము)" అను వాక్య బలముతో ఎన్నో కార్యక్రమాలు చేయ బడినవి. బేర్ బాప్టిస్టు చర్చి ద్వారా ప్రతి సంవత్సరము జూలై 24వ తేదీన బేరమ్మ జన్మదిన సందర్భమున ఏదో ఒక మంచి కార్యక్రమము జరుపుట ఆనవాయితి.

గడచిన సంవత్సరాలలో ఒక సంవత్సరము (1999) బేరమ్మ జన్మదినమును నెల్లూరు రైల్వేస్టేషన్‌లో ఒకటవ ప్లాట్‌ఫాం మీద నెల్లూరు ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డిగారు ముఖ్య అతిథిగా విచ్చేయగా, నెల్లూరు పురప్రముఖులు, శ్రేయోభిలాషు లతో ప్లాట్‌ఫాం నిండిపోయింది. కేక్ కటింగ్ అనంతరం రెండు వీల్‌ఛైర్స్‌ను అంగవైకల్యంగల వారికి ఉపయోగించుటకు రైల్వే స్టేషన్‌కు బహూకరించబడినవి.

మరొక సంవత్సరం (2006) స్థానిక బాప్టిస్టు సంఘం దౌనీ హాలు వారు స్పాన్సర్ చేయగా బి.సి.హాస్పిటల్‌లో పెద్ద మెడికల్ క్యాంపు నెల్లూరులోని 16 మంది స్పెషలిస్ట్ డాక్టర్లు, 50 మంది నర్సుల సహకారంలో జరిగింది. 900 మందికి

ఉచితంగా వైద్య పరీక్షలు, మందులు ఇవ్వబడినవి. 2003 నుండి బి.సి.హాస్పిటల్ మూసివేసినప్పటికీ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టటం వలన పట్టణ ప్రజలు ప్రశంసించారు. ఈ సంవత్సరం (2008) బేరమ్మ జన్మదినమును పురస్కరించుకొని నెల్లూరులోని మదర్ తెరీసా హోంలోని 136 మంది వికలాంగులు, గ్రుడ్డివారు, మతిస్థిమితంలేని వారికి బిస్కట్లు, బన్స్, అరటిపళ్ళు, స్వీట్స్ పంచబడినవి. వాక్య పరిచర్య జరిగింది.

అంటరాని వారిగానున్న వారిని అక్కున చేర్చుకొని విద్యా భిక్షపెట్టి సమాజంలో గౌరవ ప్రదమైన జీవనం సాగించగల స్థాయికి తెచ్చిన క్రైస్తవ మిషనేరీలు వంద సంవత్సరాల క్రితం మన యెడల చూపిన ప్రేమకు కృతజ్ఞతగా సంవత్సరంలో ఒక్కసారి వారిని గుర్తు చేసుకొని, వారి కొరకు, వారి బంధువుల కొరకు ప్రార్ధనలు చేయాలన్న ఉద్దేశంతో 'ది డే ఆఫ్ మిషన్స్' అనే కార్యక్రమము జరుపుకొనుట ఆశీర్వాదకరమని గుర్తించి ప్రతి సంవత్సరం మార్చి 24వ తేది జరుపుతాము. డినామినేషన్ బేధం లేకుండా అందరిని ఆహ్వానిస్తాము, ఘనంగా దేవుని మహిమకరంగా జరుపుతాము.

బాప్టిస్టు మిషన్ ఆస్తులు అన్యాక్రాంతం మవుతున్న నేటి పరిస్థితులలో నాటి బాప్టిస్టు మిషన్‌లో జరిగిన సేవా కార్యక్రమాలు, ఆనాటి బాప్టిస్టు నాయకులకున్న సేవా తపన, మిషన్ కార్యక్రమాలను కొనసాగించాలనే బాధ్యతా, భారం ఏ ప్రాంతమందైనా వున్నదా? అని ప్రశ్నించుకుంటే జవాబు ప్రకాశం జిల్లా 'కందుకూరు' అని చెప్పక తప్పదు.

ఆనాడు కందుకూరు పొలములో హోం మిషనెరీలుగా కీ.శే. రాజరత్నంగారు, కీ.శే. పులుకూరి అబ్రాహాంగారు, కీ.శే. పులుకూరి జయకుమార్‌గారు ఎంతో ఘనమైన సేవ చేసిన దైవసేవకులు. వారి తదనంతరం డా॥ పులుకూరి విక్టర్ అబ్రాహాంగారు హోం మిషనెరీ బాధ్యతలు సేవాభారంతో చేపట్టటం జరిగింది. వీరు కందుకూరు, పరిసర గ్రామాలలో చేసిన సేవనుబట్టి వారు విడుదల చేసిన 'సీడ్ అండ్ షో జీసస్' అనే సండేస్కూలు టీచర్స్ గైడ్, సండేస్కూలు పిల్లల కొరకు పాటలు, యాక్షన్ సాంగ్స్, మరి ముఖ్యంగా సండేస్కూలు పిల్లలతో నిర్మించబడిన 'దానియేలు' వీడియో ఫిలిం, మిషన్ బంగ్లా, చర్చ్ రినోవేషన్ మొదలైన మంచి కార్యక్రమాలనుబట్టి సెప్టెంబరు 13న బేర్ బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో జరిగిన 'సీడ్ అండ్ షో జీసస్' కార్యక్రమములో డా॥ పులుకూరి విక్టర్ అబ్రాహాంగారిని, వారి సతీమణి డా॥ శోభగారిని సవినయంగా సత్కరించడం జరిగింది. నాటి కార్యక్రమములో సాల్వేషన్ ఆర్మీ, లూథరన్, సి.యస్.ఐ. చర్చీల నుండి టీచర్స్, నాయకులు రాగా కార్యక్రమము ఎంతో ఘనంగా దేవుని నడిపింపులో జరిగినది. కార్యక్రమములో బాప్టిస్టు చర్చి డౌనిహాల్ మాజీ సెక్రటరీ శ్రీ కె.బి.జయకుమార్ గారు మాట్లాడినారు. కస్టోడియన్ శ్రీ ఐ.విజయకుమార్‌గారు వందన సమర్పణ అనంతరం లూథరన్ చర్చి పాస్టర్ నిర్మలకుమార్ ప్రార్ధన, రెవ. సుశీల్‌దత్‌గారి ఆశీర్వాదములతో కార్యక్రమము ముగిసినది.

**– కె.జె.డబ్ల్యు. జయకుమార్, నెల్లూరు**

## ఈ నెల పోషకులు :

| | | | | | |
|---|---|---|---|---|---|
| శ్రీ యడవల్లి ప్రసాదరావు | హైదరాబాద్ | 3500 | శ్రీమతి విక్టోరియా రుక్మిణి | మార్కాపురం | 250 |
| శ్రీ కిరణ్ రవివర్మ | హైదరాబాద్ | 2000 | శ్రీమతి రేవతి | వినుకొండ | 200 |
| శ్రీ బి. క్రిస్టియన్ సిరప్ప | అనంతపూర్ | 2000 | శ్రీమతి ప్రభావతి ఆండ్రూస్ | ఒంగోలు | 200 |
| డా॥ పి. హుస్సేనయ్య | బేస్తవారిపేట | 1000 | శ్రీమతి సౌభాగ్యమ్మ | ఒంగోలు | 200 |
| రెవ. డా॥ యం.యస్.శాంతవర్ధన్ | గుంటూరు | 1000 | శ్రీ కె. జయకుమార్ | నెల్లూరు | 200 |
| అపో. ఎబినెజరు | హైదరాబాద్ | 1000 | శ్రీ హరకుమార్ | నెల్లూరు | 200 |
| శ్రీ కె. సామ్యూల్ | బెంగుళూరు | 1000 | శ్రీ రాజవర్ధన్ | చీరాల | 200 |
| శ్రీమతి ఈ.వి. రాజకుమారి | నెల్లూరు | 500 | శ్రీ ప్రేమరాజు | మూగచింతల | 150 |
| డా॥ విక్టర్ అబ్రాహాం | కందుకూరు | 500 | శ్రీమతి మేరి నిర్మల | ఒంగోలు | 150 |
| శ్రీ పాటిబండ్ల సామ్యూల్ | కందుకూరు | 500 | శ్రీ టి. హేమంత్ కుమార్ | నెల్లూరు | 150 |
| శ్రీమతి నిర్మల ఎబినెజర్ | విజయవాడ | 500 | శ్రీమతి యం.యస్. కుమారి | నర్సరావుపేట | 150 |
| శ్రీ డేవిడ్ లివింగ్‌స్టన్ | మార్కాపురం | 500 | శ్రీ ఏడుకొండలు | కలిగిరి | 150 |
| శ్రీమతి యస్. శ్యామలాదేవి | కొత్తపట్నం | 500 | శ్రీ చంద్రశేఖర్ | బాపట్ల | 150 |

# సువార్తలలోని యేసు కథ

83

యేసుప్రభువు ఈ లోకములో సేవ ప్రారంభించిన నాట నుండి అవిశ్రాంతంగా యెరూషలేము నుండి తూరు సీదోను ప్రాంతం ఉత్తర దక్షిణమున గెరాసేనుల దేశము తూర్పున గలిలయ దేశమంతా సమరియ దేశము తూర్పు ప్రాంతములో ఆయన అనేక పట్టణాలు, పల్లెలు పర్యటించి దేవుని రాజ్య సువార్త ప్రజలకు ప్రకటించాడు. ఆయనతో పన్నెండు మంది అపొస్తలులు ఆయన వెంట వున్నారు. దయ్యాల నుండి విడిపింపబడిన కొందరు స్త్రీలు, రోగాలు పొగొట్టుకొనిన కొందరు స్త్రీలు యోహన్న అనే ప్రముఖురాలు, సూసన్న ఇంకా ధనవంతులైన కొందరు స్త్రీలు తమ స్వంత డబ్బుతో యేసు వెంబడి తిరుగుతూ ఉండేవారు.

అలా ప్రభువు పర్యటిస్తున్నప్పుడు యెరూషలేమునకు తూర్పున రెండున్నర మైళ్ళ దూరంలో వున్న బేతనియ గ్రామ వాస్తవ్యురాలు మార్త ఆయనను భోజనానికి ఆహ్వానించింది. ధనవంతులైన వారు తప్పితే యేసును భోజనానికి ఎవరూ ఆహ్వానించలేదు. మార్తకు ఒక చెల్లెలు మరియ, తమ్ముడు లాజరు ఉన్నారు. ఇంటి పెత్తనమంతా మార్తదే. యేసుప్రభువు వెంట వున్న వారు దాదాపు ఇరవైమందికి పైనే. వీరందరికీ భోజన సదుపాయాలు చూడాలి. వారికి రోజు సహాయపడే పనివారు ఉన్నప్పటికీ అతిథులు ఎక్కువగా వున్నందునను, ఆమె స్థితికి తగిన విధంగా మంచి భోజనము అంటే ఖరీదైన భోజనము సిద్ధపరచుటకు చాలా కష్టపడవలసింది.

యేసుప్రభువు ఇంట్లో ప్రవేశించగానే మరియ చాపవేసి చిన్న ప్రార్థన కూటములాగా ఏర్పాటు చేసింది. ఆయన శిష్యులతోపాటు ఇరుగు పొరుగు వారు కూడ యేసయ్య మాటలు వినటానికి కూర్చున్నారు. యేసయ్య కంటే ఆయన అద్భుత క్రియలకంటే ఆయన మాటలు జీవము కలవి. అందుకే పేతురు 'ప్రభువా, ఎవని యొద్దకు వెళ్ళుదము, నీవే నిత్యజీవపు మాటలు గలవాడవు' అన్నాడు.

యేసుప్రభువు మాటలలోని రుచినెరగిన వారికి ఈలోక సంబంధమైన మరి ఏ మాటలు రుచించవు. మరియ అందరికంటే ముందుగా యేసుప్రభువు పాదాలకు దగ్గరగా కూర్చుని ఆయన నోట నుండి వచ్చే ప్రతి అక్షరాన్ని తన్మ యత్వంతో ఆస్వాదిస్తూ సరిసరాలను మరచిపోయింది. మామూలుగా ఆమె అక్కకి ఎప్పుడూ లోబడేయుండేది. ఇటువంటి పరిస్థితులలో అక్కకంటే ఎక్కువగా ఇంటి పనిలో సహాయపడేది. మరియ ఇల్లు వదలి బయటకువెళ్ళే స్వభావము లేదు. కొందరు ఊహిస్తున్నట్లుగా ఆమె మగ్దలా మరియ కాదు. ఆమె ఇంటికి మాత్రమే పరిమితమైనది. తరువాత రోజుల్లో కూడా ఆమె యేసు యొక్క దైవత్వాన్ని పూర్తిగా అర్థం చేసు కుంది. అందరూ ఆలోచిస్తున్నట్లుగా యేసు శారీరక మెస్స య్యగా కాక ఆయన ఆత్మీయ మెస్సయ్య అని నమ్మింది. కనుకనే యేసు మరణదినము గురించి దేవుడు ఆమెకు మాత్రమే బయలుపరచినందున ఆమె అచ్చ జటామాంసి చెట్టుతో చేయబడిన విలువైన ఒక శేరున్నర మంచి అత్తరును యేసు పాదాల మీద పోసి తన తల వెంట్రుకలతో పాదాలను తుడి చింది. ఇల్లంతా అత్తరు వాసనతో నిండింది. అప్పుడు ఇతరులు మాట్లాడిన దానికి జవాబుగా –ఈ అత్తరుతో నన్ను సమాధికి సిద్ధం చెయ్యడానికి ఈనాటి దాక దాన్ని ఈమె దాచియుంచింది అన్నాడు. ఆ విధంగా మరియ యేసు మాట లను దీక్షతో వింటూ మార్త యొక్క పిలుపును గుర్తించలేదు.

మార్తకు పని ఎక్కువగా వుండటంవల్ల చిరాకు కలిగింది. అంతేకాక ఆయనను గౌరవించి ప్రేమించి ఇంత ఖర్చుతో ఆయనకు భోజన ఏర్పాట్లు చేసిన ఇంటి పెద్దనైన తనను యేసు గుర్తించలేదు. చివరికి తెగించి యేసు ఎదుట నిలిచింది. ఆయన మాట్లాడటం ఆపి మార్తవైపు చూశాడు. "ప్రభువా, నా సోదరి ఇంటి పనంతా నా మీద వదలి వేయటం మీకు న్యాయమనిపిస్తుందా? వచ్చి నాకు సహాయం చేయమని ఆమెతో చెప్పండి" అని అంది. ప్రభువు ఆమెవైపు విచారం గాను, జాలిగాను చూశాడు. ప్రజలంతా ఆయన ఏమి చెప్తాడో నని చూస్తున్నారు. "మార్తా, మార్తా" అని దీనంగా "అన్ని పనులు ఎక్కువగా వుండటం వలన నీకు చింత, చికాకు కలుగుతున్నాయి. నిజంగా చేయ వలసింది ఒక్కటే పని" అని అందరివైపు చూచి "మరియ ఏది ఉత్తమమో దాని ఎన్నుకుంది. దాన్ని ఆమె నుండి ఎవరూ తీసివేయలేరు" అన్నాడు.

మార్త చేస్తున్నది సేవ. యేసు సేవ. మార్త యేసు కొరకు ఎంతో కష్టపడుతుంది. ఆ విషయం యేసు గుర్తించ లేదు అనుకుంటుంది. యేసు కొరకు మనం కష్టపడనవ సరం లేదు. యేసు కోరేది ఆయన కొరకు విశ్రాంతి లేకుండా, చికాకుగా, టెన్షన్‌తో పని చేయమని కాదు.

"యెహోవా కొరకు మౌనంగా సహనంతో మనం కనిపెట్టి ఆయన పాదాల వద్ద కూర్చుని వుండటం'"

# ఏది నిజము? ఏది అబద్ధము? ౬

## (లోకానికి బైబిల్ సవాల్)

హేతువాదుని ప్రశ్న - 22

**యెష్షయి సంతానం ఏడా? ఎనిమిదా?**

1సమూ. 16:10-11, "యెష్షయి తన యేడుగురు కుమారులను సమూయేలు ఎదుటికి పిలువగా సమూయేలు - యెహోవా వీరిని కోరుకొనలేదని చెప్పి నీ కుమారు లందరు ఇక్కడున్నారా అని యెష్షయిని అడుగగా అతడు- ఇంకను కడసారి వాడున్నాడు. అయితే వాడు (దావీదు) గొఱ్ఱెలను కాయుచున్నాడని చెప్పెను".

1దిన. 2:13-15, "యెష్షయి తన జ్యేష్ఠ కుమారుడైన ఎలీయాబును, రెండవవాడైన అబీనాదాబును, మూడవ వాడైన షమ్మాను, నాల్గవవాడైన నెతనేలును, అయిదవ వాడైన రద్దయిని, ఆరవవాడైన ఓజెమును, ఏడవవాడైన దావీదును కనెను.

**జవాబు :** ఏడు అను సంఖ్య పరిపూర్ణత్వమునకు గురుతు. కావున ఎన్నిక చేయబడిన దావీదు ఈ ప్రకారముగా ఏడవవాడుగ పరిగణింపబడుచున్నాడు. ఉదా:- దేవుడు ఆరు రోజులలో సృష్టించి ఏడవ రోజు విశ్రాంతి పొందుట. దేవుడు అనేకాత్మల బలము గలిగిన వాడైనను దేవుడు ఏడాత్మలు కలిగినవాడుగ ఎంచబడుట, దేవదూత సమూదాయములు లెక్కకుమించి యుండగా ఏడుగురు దేవదూతలు అనియు, ఏడు ముద్రలు, ఏడు తెగుళ్ళు, ఏడు స్వరములు, ఏడు తాళపు చెవులు, ఏడు ఆకాశములు, ఏడు బలిపీఠములు, ఏడు దీపస్థంభములు, ఏడు కన్నులు మొదలైన ఉదాహరణలు మనకు గ్రంథమునందు వున్నవి. దీవెనకర సంఖ్యగా ఏడును ఉపయోగిస్తూ వచ్చారు.

అయితే 1సమూ. 16:10-11 చారిత్రాత్మకముగా వరుసగా కుమారులను లెక్కపెట్టుట జరిగినది లేదా అంతకు మునుపే తన చేత పెంచబడిన బిడ్డ ఎవడైన ఆ కుటుంబ ములో వుండి తన కుమారుడుగ ఎంచబడి యుండవచ్చును.

హేతువాదుని ప్రశ్న - 23

**సౌలు దావీదును యెరుగునా? యెరుగడా?**

1సమూ. 16:19-21, "సౌలు-యెష్షయి యొద్దకు దూతలను పంపి, గొఱ్ఱెల యొద్దనున్న నీ కుమారుడైన దావీదును నా యొద్దకు పంపుమనెను. అప్పుడు యెష్షయి... పంపెను. దావీదు సౌలు దగ్గరకు వచ్చి అతని యెదుట నిలుపబడగా అతనియందు సౌలునకు బహు ఇష్టము పుట్టెను".

1సమూ. 17:57-58, "దావీదు ఫిలిష్తీయుని చంపి తిరిగి వచ్చినప్పుడు అబ్నేరు అతనిని పిలుచుకొనిపోయి ఫిలిష్తీయుని తల చేతనుండగా అతనిని సౌలు దగ్గరకు తోడుకొని వచ్చెను. సౌలు అతనిని చూచి-చిన్నవాడా నీవె వని కుమారుడవని అడుగగా దావీదు-నేను బేత్లెహేమీయుడైన యెష్షయి అను నీ దాసుని కుమారుడనని ప్రత్యుత్తరమిచ్చెను"

**జవాబు :** ఈ దినములలోనైనను ఒకసారి చూచిన వ్యక్తిని మనము వేర్వేరు ప్రదేశములలో కలిసికొన్నప్పుడు అతడేనా? కాడా? అను సంశయంతో గుర్తు పట్టడము కష్టము. మన బంధువర్గములో రక్త సంబంధీకుల బిడ్డలను అప్పుడప్పుడు మనము చూచి ఫలానా వాని అబ్బాయి అని గుర్తు పట్టగల్గి యున్నను, కొన్ని సందర్భములలో వారిని ప్రత్యేక స్థలములలో వేరుగా కలిసికొన్నప్పుడు వారిని గుర్తు పట్టలేక తికమకపడి, నీవు ఎవరి అబ్బాయివి అని అడుగుచుందుము. భయంకరుడైన ఫిలిష్తీయుని చంపి వాని తలచేత నుండగా ఇంతటి కార్యము చేయగల్గిన వీరుడు నిజముగా అతడేనా? అని తన అనుమా నము తీర్చుకొనుటకు ఆ ప్రశ్నవేసి యుండవచ్చును.

అందులోను 1సమూ. 16:19-21లో ఆయన బాల దావీదును ఒక్కసారే చూచియున్నాడు. సమూ. 17:57 -58లో ఇపుడు కొంత కండపుష్టితో ఇంక కొంత వయస్సు పైబడిన వీరుని చూచియున్నాడు. అక్కడ సాధారణ మనుష్యుని చూచెను. ఇక్కడ వీరోచిత పురుషుడుగా చూచి తన సందేహమును తీర్చుకున్నాడు.

హేతువాదుని ప్రశ్న - 24

**గొల్యాతు రెండుసార్లు చచ్చాడు....?**

1సమూ. 17:4,7,50, "గాతువాడైన గొల్యాతు అను శూరుడొకడు ఫిలిష్తీయుల దండులో నుండి బయలుదేరు చుండెను. అతడు ఆరుమూళ్ళ జానెడు ఎత్తు మనిషి. అతని యీటె కఱ్ఱ నేతగాని దోనె అంత పెద్దది. మరియు అతని యీటెకొన ఆరువందల తులము యినుము ఎత్తుగలది. ఒకడు డాలును మోయుచు అతని ముందుకు పోవుచుండెను. ... దావీదు ఫిలిష్తీయునికంటె బలాఢ్యుడై ఖడ్గము లేకయే

వడిసెలతోను రాతితోను ఆ ఫిలిష్తీయును కొట్టిచంపెను".

2సమూ. 21:19, "తరువాత గోబు దగ్గర ఫిలిష్తీయులతో ఇంకొకసారి యుద్ధము జరుగగా అక్కడ బేత్లెహేమీయుడైన యహరేయోరేగీము కుమారడగు ఎల్హానాను గిత్తీయుడైన గొల్యాతు సహోదరుని చంపెను; వాని యీటె కఱ్ఱ నేతగాని దోనె అంత గొప్పది".

(విమర్శ: గిత్తీయ అనునది గాతుకు సమానము. సహోదరుడు అని రివైజ్డ్ ఎడిషన్‌లో బేధమును తగ్గించుట కోసము వ్రాయబడినది. వచనము 22లో ఈ నలుగురు గాతులో పుట్టిన బలాఢ్యులు ఇక్కడ కుమారుడు అని వ్రాయబడి యుండాలి).

**జవాబు :** 1సమూ. 17:4,7,50 ఈ మొదటి సందర్భము దావీదు రాజుగాక ముందు జరిగినది. దావీదు సౌలు యొక్క జీవితములో ప్రధానమైన సంఘటన. 2వ సమూయేలు 21:19లో జరిగిన రెండవ సంఘటన దావీదు ఇశ్రాయేలు రాజైన తరువాత జరిగింది. ఈ రెండు సందర్భాల మధ్య చాలాకాలము గడిచిందని చెప్పవచ్చు.

ఈ రోజులలో మనము ఒకే పేరు గల్గిన అనేకమంది వ్యక్తులను మనము చూస్తూ వుంటాము. అదేవిధంగా గొల్యాతు అను పేరు గల్గిన ఇంకొంతమంది వ్యక్తులు ఆ రోజులలో వుండి వుండవచ్చు. ఇప్పుడు పేతురు, యోహాను అను పేర్లు గల వారి గురించి పరిశోధించినట్లయితే ఒక ప్రాంతంలోనే ఎంతోమందిని మనము కనుగొనవచ్చును.

హేతువాద సహోదరులకు ఇద్దరు గొల్యాతుల యొక్క యీటె కఱ్ఱలో అనుమానము వచ్చినట్లు వుంది. ఈ రోజులలో మనము సైనికుల యొక్క కత్తులు, వారి యొక్క తుపాకులు ఎటువంటి తేడా లేకుండా ఉండటం గమనించ వచ్చును. కాబట్టి సాలార్జంగు మ్యూజియంకు వెళ్ళి అక్కడ పెట్టి వున్న కత్తులు, ఈటెలు చూడమని హేతువాద సహోద రులను కోరుకుంటున్నాను. అక్కడ వున్న కత్తులు ఈటెలు ఎటువంటి తేడా లేకుండా చాలా వున్నాయి. ఇవన్నీ శ్రీకృష్ణ దేవరాయలు రాజుగా వున్న కాలము నాటివి. ఈ వాక్యాలలో ఇంకా ఏవైన విరుద్ధమగా వున్నాయా?

హేతువాదుని ప్రశ్న - 25

**నాకోను వద్ద పట్టుకొంటేనా, కీదోను వద్ద చెయ్యి చాపితేనా?**

2సమూ. 6:6,7, "వారు నాకోను కళ్ళము దగ్గరకు వచ్చినపుడు ఎడ్లకు కాలు జారినందున ఉజ్జా చెయ్యి చాపి, దేవుని మందసమును పట్టుకొనగా యెహోవా కోపము ఉజ్జా మీద రగులుకొనెను. అతడు చేసిన తప్పునుబట్టి, దేవుడు ఆ క్షణమందే అతనిని మొత్తగా, అతడు అక్కడనే దేవుని మందసమునొద్ద పడి చనిపోయెను".

1దిన. 13:9, "వారు కీదోను కళ్ళమునొద్దకు వచ్చినప్పుడు ఎడ్లకు కాలు జారినందున మందసమును పట్టుకొనవలెనని ఉజ్జా చేయి చాపగా యెహోవా కోపము అతని మీద రగులుకొనెను. అతడు తన చెయ్యి మందసము నొద్దకు చాపగా ఆయన అతని మొత్తెను. అతడు అక్కడనే దేవుని సన్నిధిని చనిపోయెను.

జవాబు : పైరులు వెన్నులు రాలగొట్టుటకు ఎడ్లచేత త్రొక్కించి ధాన్యమును ఇంటికి చేర్చు స్థలములే ఈ కళ్ళములు. ఈ కళ్ళములకు మధ్యలో ధాన్యమును ఇళ్ళకు చేర్చు బాట ఉండ వలెను. దేవుని మందసము వచ్చు బాటలో కుడి ఎడమలను ఆనుకొని ఈ కళ్ళములు ఉండి వుండవచ్చు లేదా యజమాని పేరుతో చెప్పబడుతున్న ఆ కళ్ళము అతని తదనంతరము గాని లేక తండ్రి ఉన్నను అతని కుమారుని పేరుతోగాని ఫలానివారి కళ్ళము అని రెండవ పేరు వచ్చియుండ వచ్చును.




# North East West South వార్తలు

## ఒరిస్సాలో క్రైస్తవులపై విషప్రయోగం

కొంధొమాల్, ఒరిస్సా : ఒరిస్సా రాష్ట్రం జరుగుతున్న మారణహోమంలో కొన్ని వేలమంది క్రైస్తవులు నిరాశ్రయులవగా అనధికారికంగా వందలలో హతమయ్యారు.

జడలు విప్పిన మతమౌఢ్యం క్రొత్తపుంతలు త్రొక్కుచు, మత తీవ్రవాదం వెర్రితలలు వేస్తుందనటానికి ఈ సంఘటనలు నిదర్శనం. వివరాల్లోకి వెళ్తే, దాడుల అనంతరం సహాయ శిబిరాలలో తలదాచుకుంటున్న క్రైస్తవులను హతమార్చుటకు హైందవ మత తీవ్రవాదులు నీటిలో విషం కలిపిన సంగతి వెలుగు చూచింది. జి.ఉదయగిరిలోని హబక్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన శిబిరంలో సెప్టెంబర్ 2 రాత్రి 9 గంటల ప్రాంతంలో నీటిలో విషం కలుపుతున్న వారిని చూచి సెక్యూరిటి గార్డ్ అప్రమత్తం చేయడంతో సంఘటన వెలుగు చూచింది. రాయ్‌కియలోని విజయ్ హైస్కూల్లోని సహాయ శిబిరంలో సెప్టెంబర్ 3వ తేది విషపూరిత నీరు త్రాగి 6గురు క్రైస్తవులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు.

## కర్నాటక దాడులు భజరంగదళ్ చలవే : హోంశాఖ

సెప్టెంబర్ 25, న్యూఢిల్లీ : కర్నాటకలో క్రైస్తవుల మీద జరుగుతున్న దాడుల వెనుక భజరంగ్‌దళ్ సంస్థ ఉన్నట్లు యూనియన్ హోంశాఖ ఒక ప్రకటనలో తెలియజేసింది. రాష్ట్రంలో క్రైస్తవులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బ్రతుకుతున్నట్లు ఆంతరంగిక భద్రత ప్రత్యేక కార్యదర్శి యం.యల్.కుమావత్ తెలియజేశారు. (ఈ భజరంగ్‌దళ్ సంస్థకు సంబంధించిన ఒరిస్సా వాసి ధారాసింగ్ గతంలో క్రైస్తవ మిషనరీ స్టెయిన్స్, అతని యిద్దరు కుమారులను సజీవదహనం చేశాడు. అదే సంస్థ కర్నాటకలో విధ్వంసానికి రచనలు చేసింది).

## దేశంలో క్రైస్తవులపై దాడులు పెరుగుతున్నాయి

బెంగుళూరు: బెంగుళూరు ఉత్తర నియోజకవర్గం నుండి బిజెపి యం.పి.గా ఎన్నికైన హెచ్.టి. సాంగ్లియాన క్రైస్తవులపై దాడులకు కారణం. భజరంగదళ్ మరియు హిందూసేన అని హోంమంత్రి వి.యస్.ఆచార్యకు ఫిర్యాదు చేశారు. కర్నాటక రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో దాడులు జరుగుతున్నాయన్న వార్తను ఆయన ఆచార్య దృష్టికి తీసుకెళ్ళారు. మతోన్మాద తీవ్రవాదులు మతమార్పిడి నెపంతో క్రైస్తవులను హింసిస్తున్నారని వీరికి బీజెపి కూడ ఊతమిస్తుందని తెలియజేశారు.

## ఒరిస్సా దాడుల పట్టిక

1. బార్గా జిల్లాలోని పుట్‌పల్లిలో నన్ సజీవ దహనం.
2. కొంధమాల్ జిల్లాలోని రూపా గ్రామంలో రసానంద ప్రధాన్ సజీవ దహనం.
3. క్యాథలిక్ నన్ సామూహిక అత్యాచారానికి గురైనది.
4. బల్లిగూడ గ్రామంలో క్రైస్తవ బాలురను నిర్బంధించి శిరోముండనం చేశారు.
5. భువనేశ్వర్‌లోని బిషప్ ఇంటిపై దాడి.
6. సుమారు 50,000 మంది నిరాశ్రయులయ్యారు. వందల సంఖ్యలో చర్చీలు అగ్నికి ఆహుతయ్యాయి. లెక్కలేనంత మంది గాయాల పాలయ్యారు.